సాక్షి
జోగులాంబ గద్వాల

ఆదివారం ǀ 16 ǀ మార్చి ǀ 2025



సహాయక చర్యలు

ఎస్ఎల్‌బీసీ సొరంగంలో కార్మికుల జాడ కోసం అన్వేషణ కొనసాగుతోంది.

వివరాలు 8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-28 (ఆదివారం సాయంత్రం)

సహర్ 5-12 (సోమవారం తెల్లవారుజామున)

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 39.9 /18.6

ఉదయం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. అప్పుడప్పుడు వేడి గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

వినియోగదారుల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

గద్వాలటౌన్: వినియోగదారుల హక్కులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మీనాక్షి పేర్కొన్నారు. శనివారం కళాశాలలో అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విక్రయాల సమయంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని, ఏ వస్తువు కొనుగోలు చేసినా విధిగా రశీదు పొందాలని సూచించారు. వస్తువు నకిలీదైనా.. మోసపోయామని గుర్తించినా తిరిగి పరిహారం చెల్లించడంలో ఇది ఉపకరిస్తుందని చెప్పారు. బాధితులు పూర్తి వివరాలతో వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేస్తే తగిన న్యాయం జరుగుతుందన్నారు. ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైతం వినియోగదారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ చంద్రమోహన్ వినియోగదారుల హక్కుల గురించి వివరించారు.

'ఆరోగ్యశ్రీ' సేవలకు అవకాశం కల్పించాలి



అలంపూర్: అలంపూర్ నియోజకవర్గం ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలుకు కేవలం 5 కిలోమీటర్ల దూరంలో ఉందని, ఈ ప్రాంత ప్రజలు వైద్యసేవల కోసం కర్నూల్‌పై ఆధారపడతారని, అక్కడి రెండు ఆస్పత్రుల్లో ఈ ప్రాంత ప్రజలకు ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలు పొందేలా అవకాశం కల్పించాలని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి కోరారు. శనివారం శాసన మండలి సభ సమావేశాలు జరగగా.. ఈమేరకు ఎమ్మెల్సీ మాట్లాడారు. రాష్ట్రానికి సరిహద్దుగా ఉన్న అలంపూర్ నియోజకవర్గ సమస్యలను శాసన మండలి దృష్టికి తీసుకెళ్లారు. అలంపూర్ ప్రాంతంలోని చాలామంది రైతులకు ఎప్పటి నుంచో కర్నూల్‌లో బ్యాంకు రుణాలు ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం చేసిన రుణమాఫీ కర్నూల్‌లో బ్యాంక్ ఖాతాలు ఉన్న రైతులకు చేయలేదని సభాపతి దృష్టికి తీసుకొచ్చారు. గతంలో ఎమ్మెల్యే విజయుడుతో కలిసి మంత్రికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. కానీ కర్నూల్‌లో ఖాతా లు ఉన్న రైతులకు రుణ మాఫీ చేయలేదని పేర్కొన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కర్నూల్‌లో ఖాతాలు ఉన్న రైతులకు రుణ మాఫీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మన ప్రాంత రైతులు, మన ప్రాంత భూములు కేవలం బ్యాంక్ ఖాతా కర్నూల్‌లో ఉండటంతో రుణ మాఫీ కాలేదన్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని దృష్టిసారించి కర్నూల్‌లో రుణాలు పొందిన రైతులకు రుణ మాఫీ వర్తింపజేయాలని కోరారు. గవర్నర్ ప్రసంగంలో అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలు లేవని తెలిపారు. సరిహద్దులో ఉన్న అలంపూర్ నియోజకవర్గ అభివృద్ధికి అత్యధిక నిధులు కేటాయించడానికి చొరవ చూపాలని కోరారు.

అభివృద్ధే లక్ష్యంగా ముందుకు



ఆత్మకూర్/అమరచింత/మదనాపురం: మహబూబ్‌నగర్ పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలను కాదని ప్రజలు తనను గెలిపించారని.. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా న్యాయం చేస్తానని, అభివృద్ధే ధ్యేయంగా ముందుకుసాగుతానని ఎంపీ డీకే అరుణ అన్నారు. శనివారం ఆత్మకూర్ మండలం తిప్పడంపల్లి, బాలకిష్టాపూర్‌లో పార్టీ జెండాలను ఆవిష్కరించడంతో పాటు తిప్పడంపల్లిలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అలాగే అమరచింత ఏడో వార్డులో ఎంపీ నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు, మదనాపురం మండలం గోపన్‌పేటలో బీజేపీ జెండా ఆవిష్కరించి వివిధ పార్టీలకు చెందిన 40 మంది పార్టీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎంపీ మాట్లాడుతూ.. కేంద్రం నిరుపేదలకు పీఎం ఆవాస్ యోజన కింద ఇళ్లు మంజూరు చేస్తే రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లని డ్రామాలు ఆడుతోందని మండిపడ్డారు. అర్హులందరికీ ఇళ్లు ఇప్పిస్తానని, గ్రామాల్లో హైమాస్ట్ వీధిదీపాలు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ బాటలోనే రేవంత్‌రెడ్డి పయనిస్తున్నారని.. కేంద్రానికి, ప్రధాని మోదీకి వ్యతిరేకంగా మాట్లాడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలు అమలు చేయడం చేతగాని పాలన సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పురాల్లో నీటి ఇబ్బందులు దూరం చేయడానికే కేంద్రం అమృత్ 2.0 పథకం తీసుకొచ్చిందన్నారు.

ఆవిష్కరణలకు గుర్తింపు

పీయూలో పరిశోధనలపై దృష్టి సారించిన అధ్యాపకులు

- ఇప్పటికే కెమిస్ట్రీ విభాగంలో పూర్తిస్థాయి పేటెంట్ హక్కులు
- డిజైన్ విభాగంలో రెండు, యుటిలిటీలో ఒకటి, పరిశీలనలలో మరొకటి
- గుర్తింపు వస్తే పూర్తిస్థాయిలో కొత్త ఆవిష్కరణలకు అవకాశం



పాలమూరు యూనివర్సిటీ అధ్యాపకులు బోధనపైనే కాకుండా.. పరిశోధనలపై సైతం దృష్టిసారించారు. గత కొన్నేళ్లుగా సాగుతున్న పరిశోధనలతో పలు అంశాల్లో పేటెంట్ రైట్స్ సైతం సాధించారు. మొత్తం కెమిస్ట్రీ విభాగంలో అధ్యాపకులు పర్యావరణహిత రీ ఏజెంట్లు, ఎలాంటి కెమికల్స్ లేకుండా సాధారణ పర్యావరణానికి అనుకూలమైన విధానంలో తయారు చేయడం యూనివర్సిటీ చరిత్రలో ఓ మైలురాయి. దీనికి పేటెంట్ రైట్ రావడంతో టీచర్స్ అసోసియేట్ షిప్ ఫర్ రీసెర్చ్ ఎక్సలెన్స్ ఫెల్లోషిప్ అధ్యాపకులు చంద్రకిరణ్ ఎంపికయ్యారు. మ్యాథ్స్ విభాగంలో అధ్యాపకులు రిమోట్ కంట్రోల్ ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ తయారీ, రోలర్ స్టాంప్ తయారీకి డిజైన్ విభాగంలో పేటెంట్ రాగా.. స్ట్రెచింగ్ షీట్‌పై కాసన్ నానోఫ్లూయిడ్స్ ప్రవాహంలో వేడి, ద్రవ్యరాశి బదిలీని పంచే పద్ధతి వంటివి ఇటీవలే ఆవిష్కరించారు. ఇవి పరిశీలన దశలో ఉండగా.. మరో ఆవిష్కరణను ఎంబీఏ అధ్యాపకులు ఆన్‌లైన్ ట్రేడింగ్ ప్రిడెక్టర్ వంటి పరికరాలు ఆవిష్కరించారు. దీంతో ఇటు అధ్యాపకులు రీసెర్చ్ స్కాలర్స్, పీజీ, ఎంబీఏ, ఎంసీఏ, ఫార్మసీ విద్యార్థులు పరిశోధనల అనంతరం ఒక కొత్త యంత్రాల ఆవిష్కరణతో జరిగే ప్రయోజనం వంటి అంశాలపై దృష్టిసారించారు.

– మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్

కీలకంగా పర్యావరణహిత రీ ఏజెంట్లు



పేటెంట్ రైట్ సర్టిఫికెట్ చూపిస్తున్న అధ్యాపకులు చంద్రకిరణ్, రీసెర్చ్ స్కాలర్ స్వాతి (ఫైల్)

రసాయన పరిశ్రమలు, ట్యాబ్‌లెట్లు, ఇతర పరిశ్రమల్లో కెమికల్స్ తయారు చేసేందుకు రీ ఏజెంట్లు ఎంతో కీలకంగా మారనున్నాయి. ఇందులో రీ ఏజెంట్లు మొదట తయారు చేసేందుకు పెద్ద పరిశ్రమలను స్థాపించడం, పెట్టుబడి, ఇతర పర్యావరణానికి నష్టం చేసే విధంగా ప్రక్రియ చేయాల్సి ఉంటుంది. కానీ, పీయూ కెమిస్ట్రీ విభాగం అధ్యాపకులు చేసిన ప్రయోగాలు పూర్తిగా పర్యావరణ హితం కానున్నాయి. సాధారణ గది ఉష్ణోగ్రతల వద్ద చిన్న గదుల్లో సైతం రీ ఏజెంట్లను శాస్త్రీయ పద్ధతిలో తయారు చేసే విధానాన్ని కొనుగొనడంతో మూడు నెలల క్రితం కేంద్ర ప్రభుత్వం పేటెంట్ రైట్ ప్రకటించింది. ఇందులో అధ్యాపకులు చంద్రకిరణ్, సిద్ధరామగౌడ్, రీసెర్చి స్కాలర్ స్వాతి భాగస్వాములయ్యారు. వీటితోపా టు మరో 20 రీఏజెంట్‌లో పరిశోధనలో ఉన్నాయి.

రిమోట్ కంట్రోల్‌తో ఆక్సిజన్..

పీయూ మ్యాథ్స్ విభాగంలో పేటెంట్ రైట్స్ దృష్టిసారించింది. ఇందులో డిజైన్ విభాగంలో శ్వాసకోశ రోగులకు ఆక్సిజన్ థెరపీ అందించేందుకు రిమోట్ కంట్రోలర్ ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ రూపొందించారు. ఇందులో పేషెంట్ ఆరోగ్యం, పరిస్థితి తదితర అంశాలను కాన్సన్‌ట్రేటర్ పరిశీలించిన తర్వాత రోగికి ఆక్సిజన్ అందిస్తుంది. అయితే రోగికి మ్యానువల్ పద్ధతిలో ఆక్సిజన్ కాన్సన్‌ట్రేషన్ ద్వారా ఆక్సిజన్ సరఫరా చేయాలంటే ఇబ్బందికర పరిస్థితులు ఉండే నేపథ్యంలో కేవలం రిమోట్ కంట్రోల్ ద్వారా ఆక్సిజన్‌ను అవసరం మేరకు అందిస్తే ఇబ్బందులు తప్పనున్నాయి. ఇందులో పలు యూనివర్సిటీలకు చెందిన అధ్యాపకులు శంకర్‌రావు, మధు, భారతి, సత్తమ్మ, లిపిక, అరుంధతి పాలుపంచుకున్నారు.



డిజైన్ విభాగంలో పేటెంట్ పొందిన మ్యాథ్స్ అధ్యాపకుడు మధును సన్మానిస్తున్న వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ చెన్నప్ప (ఫైల్)

➪ రోలర్ స్టాంప్ పరికరాన్ని మ్యాథ్స్ విభాగం అధ్యాపకులు మధు ఆవిష్కరించగా.. పేటెంట్ రైట్ లభించింది. గణితం అంటే భయపడే పాఠశాల స్థాయి విద్యార్థులకు ఈ పరికరం ఎంతో ఉపయోగపడనుంది. దీని ద్వారా గణిత ప్రక్రియలను సులభతరం చేసేందుకు అవకాశం ఉంది.

➪ రసాయన శాస్త్రంలో కెమికల్స్ ప్రాసెసింగ్, ఏరో స్పేస్, బయో మెడికల్ ఇంజినీరింగ్ పారిశ్రామిక అనువర్తనాల్లో వేడి, ద్రవ్యరాశి బదిలీలో కీలకపాత్ర పోషిస్తున్న స్ట్రెచింగ్ షీట్‌పై కాసన్ నానో ఫ్లూయిడ్ ప్రవాహంలో వేడి, ద్రవ్యరాశి బదిలీని పెంచే పద్ధతిలో కూడా మ్యాథ్స్ విభాగంలో పరిశోధనలు పూర్తి కాగా పేటెంట్ రైట్ పరిశీలనలో ఉన్నాయి.

నానో టెక్నాలజీ బ్యాండేజీ..

సాధారణంగా గాయాలు త్వరగా తగ్గేలా సూక్ష్మజీవులను చంపేందుకు వినియోగించే బ్యాండేజీలు కొత్త విధానాన్ని ఆవిష్కరించడంలో పీయూ బాటనీ డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు శివకుమార్‌సింగ్ సఫలమయ్యారు. సూక్ష్మజీవులను చంపే బ్యాండేజీలో చెట్ల రసాయనాలను వినియోగించి నానోపార్టికల్స్ ఆవిష్కరించారు. వీటి ప్రభావం సూక్ష్మజీవులపై ఎలా ఉంటుందో నిరూపించారు. ఈ ప్రయోగంలో బెంగళూరుకు చెందిన సైంటిస్టులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ ప్రయోగానికి 2023లో పేటెంట్ రైట్ అందుకున్నారు.



శివకుమార్‌సింగ్‌ను సన్మానిస్తున్న వీసీ శ్రీనివాస్ తదితరులు



అర్జున్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రకిరణ్ తదితరులు (ఫైల్)

కీలకంగా స్టాక్ మార్కెట్ ప్రిడిక్టర్..

పీయూ ఎంబీఏ విభాగంలో ఆన్‌లైన్ ట్రేడింగ్ చేసే వారికి స్టాక్ మార్కెట్ ప్రిడిక్టర్ భవిష్యత్‌లో కీలక పరికరంగా మారే అవకాశం ఉంది. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టే వారికి మంచి సాధనంగా మారుతుంది. దీని ద్వారా స్టాక్ మార్కెట్‌ను పరిశీలించడానికి ఏఐని వినియోగించనున్నారు. ఇది మార్కెట్ అంచనా వేసేందుకు ఇంటర్నెట్, సోషల్ మీడియాలో ఆర్థికపరమైన వార్తలు, మీడియా కథనాలను అంచనా వేసి ఏ కంపెనీ షేర్ మార్కెట్‌లో లాభాలు గడిస్తాయనే అంశంపై మిషన్ లెర్నింగ్, ఆల్గరిథమ్ ఆధారంగా సమాచారం ఇస్తుంది. ఇది అందించిన సమాచారం మేరకు షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టవచ్చు అనే అంశంపై సమాచారం ఇస్తుంది. ఇందులో పలు కళాశాలలకు చెందిన సురేష్‌కృష్ణ, కన్నమ్మల్, గాయత్రి, అర్జున్‌కుమార్, కిరుబదేవి, సుమందీశ్వర్, రాజామణి పాల్గొనగా.. పీయూ అధ్యాపకులు అర్జున్‌కుమార్ కీలకంగా వ్యవహరించారు.

ప్రాధాన్యం ఇస్తున్నాం..



యూనివర్సిటీలో అధ్యాపకులు, ఇటు రీసెర్చ్ స్కాలర్ ఎంతో ఉత్సాహంగా పరిశోధనలపై దృష్టి సారిస్తున్నారు. ఇటీవల కొన్ని పేటెంట్లు కూడా వచ్చాయి. దీని ద్వారా పీయూకు ప్రాజెక్టులు, రీసెర్చ్ పరమైన అంశాల్లో ముందంజ వేస్తున్నాం. నిర్మాణంలో రీసెర్చ్ ఫెసిలిటీ భవనం ఉంది. అది అందుబాటులోకి వస్తే పీయూ రీసెర్చ్ హబ్‌గా మారనుంది. అందులో పూర్తిస్థాయిలో ల్యాబ్‌లో అధునాతన ప్రయోగ పరికరాలు అందుబాటులోకి తీసుకువస్తాం.

– శ్రీనివాస్, వైస్ చాన్స్‌లర్, పాలమూరు యూనివర్సిటీ

మరింత ఊతం..



యూనివర్సిటీలో రీసెర్చ్‌తో పాటు కొత్త ఆవిష్కరణలకు అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్స్ కృషిచేయడం గొప్ప విషయం. భవిష్యత్‌లో రీసెర్చ్ ఫెసిలిటీ అందుబాటులోకి రానుంది. ఇంజినీరింగ్ కళాశాలకు రెగ్యులర్ అధ్యాపకులు రానున్నారు. దీంతో మరింత రీసెర్చ్ పెరగనుంది. పలు ప్రతిష్టాత్మక సంస్థలతో ఎంఓయూ చేసుకునేందుకు చర్చలు జరుగుతున్నాయి.

– మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పీజీ కళాశాల, మహబూబ్‌నగర్

రైతుల అభ్యున్నతికి కృషి

అయిజ: రైతులకు అన్నిరకాలుగా చేయూతనిచ్చేందుకే పీఏసీఎస్‌లు పనిచేస్తున్నాయని, రైతులు అభ్యున్నతికోసం అందరం కృషిచేద్దామని డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయం ఆవరణలో అయిజ సింగిల్‌విండో అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన పీఏసీఎస్ చైర్మన్‌లు, కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీసీసీబీ చైర్మన్ మాట్లాడుతూ.. ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో 78 సహకార సంఘాలు ఉన్నాయని, వాటిలో అయిజ పీఏసీఎస్‌లో ఎక్కువమంది ఉద్యోగులను నియమించుకొని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని కొనియాడారు. పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు నేరుగా లబ్ధి చేకూర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలను అమలుచేస్తున్నాయని అన్నారు. వ్యవసాయం కోసం అతి తక్కువ వడ్డీతో పంట రుణాలు ఇవ్వడంతోపాటు దీర్ఘకాలిక రుణాలను ఇస్తుందని, ట్రాక్టర్, హార్వెస్టర్, డ్రోన్స్ తదితర వ్యవసాయ వస్తువులు కొనుగోలుకు చేసేందుకు కూడా తక్కువ వడ్డీకే రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. సొసైటీలు కేవలం రైతులకు రుణాలు ఇచ్చేవిగా ఉండరాదని, రైతులకు మేలుచేయడంతోపాటు సొసైటీ ఆదాయాన్ని పెంచుకునేందకు అనేక రకాల కార్యకలాపాలను చేపట్టాలని పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ ఈర్లదిన్నె రంగారెడ్డి, అలంపూర్ క్యాతూర్, కలగొట్ల, మానవపాడు, వడ్డెపల్లి, గట్టు సహకార సంఘాల చైర్మెన్‌లు మోహన్‌రెడ్డి, రాఘవరెడ్డి, గజేంద్ర రెడ్డి, శ్రీధర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, క్యామ వెంకటేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి

సర్కారు బడుల్లో కృత్రిమ మేధస్సుతో బోధన



కొండేరులో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభించిన అనంతరం ఏఐ ఆధారిత బోధనను పరీక్షిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

ఎర్రవల్లి: సర్కారు బడుల్లో కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగంతో మరింత ప్రభావవంతంగా విద్యా బోధన అందించనున్నట్లు కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. శనివారం ఎర్రవల్లి మండలంలోని కొండేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ ఏఎక్స్ఎల్ కంప్యూటర్ ల్యాబ్‌ను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు అందుతున్న వసతులను పరిశీలించారు. ఏఐ ఆధారిత బోధన పద్ధతులను వీక్షించి ఉపాధ్యాయులకు పలు సూచనలు అందించారు. విద్యార్థుల అభ్యాసాన్ని ఆకర్షనీయంగా, ఇంటరాక్టివ్‌గా మార్చేందుకు ఏఐ కీలకంగా సహకరిస్తుందని అన్నారు. 26 ప్రభుత్వ పాఠశాలల్లో పైలెట్ ప్రాజెక్టుగా ఏఐ తరగతులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఫౌండేషనల్ లిటరసీ, న్యూమెరసీ ప్రాథమిక విద్యా స్థాయిలో ఏఐ ఆధారిత డిజిటల్ పద్ధతుల ద్వారా ప్రాథమిక స్థాయిలో చదవడం, రాయడం, సంఖ్యాపరమైన విజ్ఞానాన్ని పెంపొందించుకుంటారని తెలిపారు. దీనికోసం పాఠశాలల్లో కంప్యూటర్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, పూర్తిస్థాయి ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులో ఉంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ నరేష్, ఎంఈఓ అమీర్‌ఫాష, హెచ్‌ఎం శ్రీనివాసులు, జిల్లా కోఆర్డినేటర్ ఎస్తర్ రాణి తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే లక్ష్య సాధన

ఎర్రవల్లి: విద్యార్థులు పట్టుదలతో కష్టపడి చదివితే జీవితంలో ఏ లక్ష్యమైనా సాధించగలరని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. శనివారం ఎర్రవల్లి మండల కేంద్రంలోని సరస్వతి పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలలు కనే ప్రతి ఒక్కరూ వాటిని నిజం చేసుకునే ధైర్యం, పట్టుదలను కలిగి ఉండాలన్నారు. మీరు ఎక్కడి నుండి వచ్చారో కాదు, మీ లక్ష్యం ఎంత గొప్పదో, దాని కోసం ఎంత కృషి చేస్తున్నారో, అదే మీకు నిజమైన విజయాన్ని నిర్దేశిస్తుందని అన్నారు. విద్యార్థులు చదువులో మాత్రమే కాకుండా క్రీడలు, శారీరక విద్య, మౌళిక నైపుణ్యాల్లో కూడా రాణించాలన్నారు. అనంతరం గత ఏడాది సబీఎస్ఈ 10వ తరగతి టాపర్ తల్లిదండ్రులను కలెక్టర్ మెమోంటోలను అందజేశారు. గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు మేలు చేకూర్చండి

అయిజ: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి కూలీలకు మేలు చేకూర్చాలని అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీ) నర్సింగరావు అన్నారు. శనివారం మండలంలోని సంకాపురం, బింగుదొడ్డి గ్రామాల శివార్లలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఉపాధి పనులు చేసే కూలీలకు ప్రతిరోజు రూ. 300 కూలి వచ్చే విధంగా యాక్షన్ ప్లాన్ తయారుచేసుకోవాలని సిబ్బందిని సూచించారు. కూలీలు పనిచేసే ప్రదేశాల్లో షెడ్ నెట్, మంచినీటి సదుపాయం కల్పించాలని, ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని ఆదేశించారు. ఎక్కువమంది కూలీలు పనికి వచ్చేవిధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈసందర్భంగా ఈజీఎస్ సిబ్బంది కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. ఎంపీడీఓ వెంకటయ్య, ఏపీడీ శ్రీనివాసులు, ఈజీఎస్ ఏపీఓ లాలు నాయక్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు రాధాగోపాల్, రమేష్ ఉన్నారు.



ఈజీఎస్ సిబ్బందికి సూచనలిస్తున్న అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు

కొత్తబావిని సంరక్షించాలి..

గద్వాల: గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఎదురుగా రాజుల కాలం నాటి సంస్థానాదీశులకు చెందిన (కొత్తబావి) సంరక్షించాల్సిన బాధ్యత అందిరిపై ఉందని గద్వాల క్రీడా సంఘాలు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలోని జిల్లా అడిషన్ కలెక్టర్ నర్సింగ్‌రావుకు వారు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి లేకుండా బావి చుట్టూ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించడానికి తలపెట్టిన సందర్భంలో మున్సిపల్ కమిషనర్‌కు జనవరిలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడంతో మాజీ మున్సిపల్ చైర్మన్ వేణుగోపాల్ స్థానిక రాజకీయ నాయకుల అండతో బావిని మట్టితో కూల్చడానికి కార్యచరణ చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని మోహన్‌రావు, శంకర ప్రభాకర్, గోపాల్, శుబాన్, నాగరాజ్, తదితరులు ఉన్నారు.

ఎట్టకేలకు మిల్లు యజమాని అరెస్టు

రూ.3.76 కోట్ల ధాన్యం గోల్‌మాల్

గద్వాల క్రైం: రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ వారు 2021–22 రబీ సీజన్‌లో ధాన్యాన్ని మర ఆడించి ఇచ్చేందుకు ఓ మిల్లుకు 774.33 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కేటాయించగా.. సదరు మిల్లు యజమాని ధాన్యాన్ని బ్లాక్ మార్కెట్‌లో విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. ఎట్టకేలకు మిల్లు యజమానిని పోలీసులు శనివారం పట్టుకున్నారు. గద్వాల సీఐ శ్రీను తెలిపిన వివరాలిలా.. గద్వాల మండలం కాకులారం గ్రామానికి చెందిన క్రిష్ణయ్యగౌడ్ అదే గ్రామంలో క్రిష్ణరైస్ మిల్లును ఏర్పాటు చేసుకున్నాడు. అయితే 2021 – 2022 రబీ సీజన్‌లో ఐకేపీ నుంచి 774.33 మెట్రిక్ టన్నుల వరిధాన్యాన్ని సివిల్ సప్‌లైశాఖ సీఎంఆర్ నిమిత్తం మిల్లుకు కేటాయించింది. అయితే మిల్లు యాజమాని మర అడించిన బియ్యాన్ని ప్రభుత్వానికి అందించకుండా రూ.3.76 కోట్ల సొమ్మును పక్కదారి పట్టించాడు. అధికారులు ఇచ్చిన గడవు ముగియడంతో విచారణ చేపట్టిన క్రమంలో వాస్తవ విషయాలు బహిర్గతం కావడంతో జిల్లా సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మేనేజర్ ప్రసాద్‌రావు ఫిర్యాదు మేరకు 27.05.2023న గద్వాల రూరల్ పోలీసు స్టేషన్‌లో మిల్లు యాజమానిపై చీటింగ్ కేసు నమోదు చేశారు. ఎట్టకేలకు క్రిష్ణరైస్ మిల్లు యాజమాని క్రిష్ణగౌడ్‌ను అదుపులోకి తీసుకుని అలంపూర్ కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ కేసులో మరికొంత మందిని త్వరలో అరెస్టు చేస్తామన్నారు.

2023లో కేసుల నమోదు

ఇదిలాఉండగా, క్రిష్ణ రైస్‌మిల్లు యాజమాని క్రిష్ణయ్యగౌడ్, వడ్డేపల్లి మండలంలోని శాంతినగర్‌కు చెందిన సూర్య ట్రేడర్ రైస్ మిల్లు యాజమాని నర్సింహులు, అయిజ కేంద్రంలోని అన్నపూర్ణ రైస్ మిల్లు యాజమాని సువర్ణపై 2023లో చీటింగ్ కేసులు ఆయా పోలీసు స్టేషన్‌లో నమోదు చేశారు. దాదాపు రూ.11 కోట్ల విలువ గల ధాన్యం గోల్‌మాల్ అయ్యింది. అయితే 2021 అక్టోబర్ 2వ తేదీన గద్వాల పట్టణంలోని రేఖ రైస్ మిల్లులో 170.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకుని డీసీఎం వాహనం సీజ్ చేశారు. ధాన్యం సరఫరా విషయంలో అధికారులకు తప్పుడు అఫిడవిట్ల ద్వారా సీఎమ్మార్‌ను ప్రభుత్వం నుంచి కాజేసినట్లు అప్పటి అధికారులు విచారణలో గుర్తించారు. అయితే రేఖా రైస్ మిల్లు వ్యవహారంలో ఎన్‌ఫోర్స్ డీటీ గణపతి, పోలీసుశాఖలోని పలువురు సీఐ, ఎస్ఐ స్థాయిలోని అధికారులను సస్పెండ్ చేస్తూ గత ప్రభుత్వం చర్యలు తీసుకున్న విషయం విధితమే.

కార్పొరేషన్లను నిర్వీర్యం చేసిన బీఆర్‌ఎస్

స్టేషన్ మహబూబ్‌నగర్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కార్పొరేషన్లను నిర్వీర్యం చేసిందని టీపీసీసీ ఉపాధ్యక్షులు, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ విమర్శించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లను పూర్తిగా విస్మరించిందన్నారు. పదేళ్లలో పట్టించుకోలేదని, కాని ఎన్నికల సంవత్సరం అరకొరగా ఆర్థికసాయం ఇచ్చి చేతులు దులుపుకుందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి సామాజిక విప్లవకారుడని, ఆయన నేతృత్వంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. రాజీవ్ యువ వికాస పథకంలో బ్యాంకు లింకేజీతో ఒక్కో లబ్ధిదారుడికి రూ.3లక్షల వరకు ఆర్థికసాయం అందజేయడానికి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రూ.6 వేల కోట్లతో రాష్ట్రంలో 5 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగ యువతకు బ్ధిచేకూరుతుందన్నారు. ఈనెల 15న నోటిఫికేషన్ విడుదలైందని, వచ్చేనెల 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం ఏప్రిల్ నుచి 6 నుంచి మే 31 వరకు లబ్ధిదారుల ఎంపిక, జూన్ 2న చెక్కులు అందజేస్తామని తెలిపారు. మైనార్టీ కార్పొరేషన్‌కు రూ.800 కోట్లు కేటాయించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు చెప్పారు.

వైభవం.. అలివేలుమంగ రథోత్సవం



- ఘనంగా గరుడవాహన సేవ
- భక్తి పారవశ్యంతో పులకించిన భక్తులు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ అలివేలు మంగతాయారు రథోత్సవం (విమాన రథోత్సవం) శుక్రవారం అర్ధరాత్రి అంగరంగ వైభవంగా సాగింది. ముందుగా శోభాయమానంగా అలంకరించిన గరుడ వాహనంపై వేంకటేశ్వరస్వామి, అలివేలు మంగతాయారు దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను ఉంచి సన్నాయి వాయిద్యాలు, పురోహితుల వేదమంత్రోచ్చారణల నడుమ గర్భాలయం నుంచి ప్రధాన ద్వారం మీదుగా ఆలయ ఆవరణలోని రథం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం రంగురంగుల పూలు, విద్యుద్దీపాలు, మామిడి తోరణాలతో ముస్తాబుచేసిన రథంపై ఉంచారు. రథం ముందు కుంభం పోసి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తుల గోవింద నామ


అలంకరణలో ఉత్సవమూర్తులు

స్మరణలు చేస్తూ ముందుకు లాగారు. సాంప్రదాయ రీతిలో ఆలయం ముందున్న దేవగుండు వద్దకు లాగి తిరిగి ఆలయానికి తీసుకొచ్చారు. రథోత్సవానికి ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. బంగారు ఆభరణాలు, కాగడాలు, విద్యుద్దీపాల వెలుతురులో స్వామి, అమ్మవార్లు ధగధగ మెరిసిపోతూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం మళ్లీ ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై గర్భగుడి తీసుకొచ్చారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ప్రత్యేక అభిషేకం, బలిహరణం, హోమం తదితర పూజా కార్యక్రమాలు కొనసాగాయి.

అశ్వవాహనసేవ..

అలివేలు మంగతాయారు ఆలయంలో శనివారం రాత్రి అశ్వవాహనసేవ నిర్వహించారు. శోభాయమానంగా అలంకరించిన అశ్వవాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఉంచి గర్భగుడి నుంచి దేవస్థానం ముందున్న మండపం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. భక్తుల హరినామస్మరణ, పురోహితుల వేదమంత్రాలు, సన్నాయి వాయిద్యాలు, కాగడాల వెలుతురులో అశ్వవాహనం ముందుకు కదిలింది. స్వర్ణాభరణాల అలంకరణలో వేంకటేశ్వరస్వామి సమేత అలివేలు మంగతాయారు అశ్వవాహనంపై ఊరేగుతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. విశేష దినోత్సవం సందర్భంగా గుట్టపైనున్న లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద భక్తుల రద్దీ కనిపించింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందాచారి, పాలక మండలి సభ్యులు వెంకటాచారి, సురేందర్, గోవిందు, అలువేలమ్మ, సుధ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

■ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వసంతోత్సవం, పూర్ణాహుతి, అవభృతస్నానం, రాత్రికి నాగబలి (నాగవెల్లి), ద్వాదశ ఆరాధన, సప్తావరణాలు, మహా ఆశ్వీరచనం తదితర కార్యక్రమాలు జరగనున్నాయి. దీంతో అమ్మవారి ఉత్సవాలు ముగుస్తాయి.

రమణీయం.. రామలింగేశ్వరుడి రథోత్సవం

- కందూర్‌లో మార్మోగిన శివనామస్మరణ
- భారీగా తరలివచ్చిన భక్తజనం


అలంకరణలో స్వామివారి మూల విగ్రహం


రథోత్సవానికి హాజరైన భక్తజనం

అడ్డాకుల: మండలంలోని కందూర్ రామలింగేశ్వరస్వామి రథోత్సవం శుక్రవారం అర్ధరాత్రి రమణీయంగా సాగింది. ముందుగా గ్రామం నుంచి రామలింగేశ్వరస్వామి వెండి ముఖం, నాగపడగను మంగళవాయిద్యాలు, డప్పుచప్పుళ్ల నడుమ బాణసంచా కాలుస్తూ భక్తుల శివనామస్మరణతో ఆలయానికి తీసుకొచ్చారు. అక్కడ పూజారులు వాటికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని ఉత్సవ విగ్రహాలను మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ఆలయం వెలుపలకు తీసుకొచ్చి అలంకరించిన రథంపై ఉంచారు. తర్వాత రథం ముందు పోలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించి రథాంగ హోమం చేసి హారతులిచ్చారు. శనివారం తెల్లవారుజామున అశేష భక్తజనం శివనామస్మరణ చేస్తూ మేళతాళాల మధ్య స్వామివారి రథాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో ముందుకు లాగారు. రథం ముందు భక్తులు భజనలు, కోలాటాలు చేస్తూ అందరిని అలరించారు. రథోత్సవానికి వివిధ ప్రాంతాల భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. కార్యక్రమంలో ఆలయ ఈఓ రాజేశ్వరశర్మ, గ్రామపెద్దలు నాగిరెడ్డి, శ్రీహరి, రవీందర్‌శర్మ, దామోదర్‌రెడ్డి, రాములు, బుచ్చన్నగౌడ్, దేవన్నయాదవ్, మనోహర్, సత్తిరెడ్డి, అర్చకులు యాదగిరిశర్మ, తాళ్లపాక రామలింగశర్మ, శివశర్మ, మణికంఠశర్మ, రేవంత్‌శర్మ, వినయ్‌శర్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

అచ్చంపేట రూరల్: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఓ వ్యక్తిపై శనివారం అచ్చంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని పాతబజార్‌లో సివిల్‌సప్లయ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వాహనాలను తనిఖీ చేస్తుండగా... అనుమానాస్పదంగా ఓ ఆటోలో 18 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. ఈ బియ్యం ఎవరివని విచారించగా ఎండీ ఉస్మాన్ అనే వ్యక్తి తెల్ల రేషన్ కార్డుదారుల నుంచి బియ్యం సేకరించి బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరకు అమ్ముకుంటాడని తేలింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. కాగా కొంతమంది అధికార పార్టీ నాయకులు, అధికారులు కేసు నుంచి అసలు సూత్రధారులను తప్పించే ప్రయత్నాలు చేసినట్లు సమాచారం.

క్లుప్తంగా

సంప్‌లో పడి చిన్నారి మృతి


నాన్సీ(ఫైల్)

బల్మూర్: అప్పటివరకు అందరిని నవ్విస్తూ ఆడుకుంటున్న చిన్నారి సంప్‌లో పడి దుర్మరణం పాలైన ఘటన మండలంలోని కొండనాగుల గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన చింత మహేష్, సుస్మిత దంపతులు. వీరికి నాన్సీ(2) అనే కూతురు ఉంది. పక్కనే ఉన్న తాత బాలయ్య ఇంటికి ఆడుకుంటూ వెళ్లింది. అక్కడ చిన్నారిని ఎవరూ గమనించకపోవడంతో ఇంటి ముందు ఉన్న సంప్‌లో పడింది. కొంత సేపటికి గమనించిన కుటుంబ సభ్యులు చిన్నారిని సంప్‌లో నుంచి తీయగా అప్పటికే నీళ్లు మింగి ఊపిరాడక మృతి చెందింది. చిన్నారి మృతితో ఆకుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి.

బావిలో పడి వ్యక్తి..


చంద్రయ్య (ఫైల్)

మిడ్జిల్: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మిడ్జిల్ మండలం వేముల గ్రామంలో శనివారం ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికుల వివరాల మేరకు.. వేములకు చెందిన రేవల్లి చంద్రయ్య (50) గురువారం రాత్రి గ్రామంలో నిర్వహించిన కాముడి దహనం కార్యక్రమానికి వెళ్లాడు. అర్ధరాత్రి 1గంటకు కాముడి దహనం ముగిసిన అనంతరం బుడిద తీసుకుని వస్తుండగా.. గ్రామ సమీపంలోని ఆలయం వద్ద ఉన్న బావిలో ప్రమాదవశాత్తు పడ్డాడు. ఈ విషయాన్ని ఎవరూ గమనించలేదు. అతడి కోసం కుటుంబ సభ్యులు వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో శనివారం గ్రామ సమీపంలోని ఆలయం వద్ద ఉన్న బావిలో శవమై కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటికి తీశారు. మృతుడికి భార్య కళమ్మ, కుమారుడు శివకుమార్ ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమర్టం నిమిత్తం జడ్చర్ల మార్చురీకి తరలించినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు తెలిపారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి..


రవీంద్రనాథ్‌రెడ్డి (ఫైల్)

ఉండవెల్లి: మండలంలోని అలంపూర్ చౌరస్తా నుంచి చెన్నిపాడుకు బైక్‌పై వెళ్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి(38) అనే వ్యక్తి పెద్దపోతులపాడు స్టేజీ సమీపంలో అదుపు తప్పి కిందపడటంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్‌పై అలంపూర్ చౌరస్తా నుంచి స్వగ్రామమైన చెన్నిపాడుకు బైక్‌పై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో బైక్ అదుపు తప్పి కిందపడినట్లు చెప్పారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించి అంబులెన్స్‌లో కర్నూలు ఆస్పత్రికి తరలించారు.

మహిళ ఆత్మహత్యపై కేసు నమోదు

జడ్చర్ల: మండలంలోని కోల్‌బాయితండాకు చెందిన పాత్లావత్ శారద(45) తన ఇంటిలో శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు. సీఐ కథనం మేరకు.. కోల్‌బాయితండాకు చెందిన శారద భర్త శంకర్ ఆరేళ్ల క్రితం మృతిచెందగా ఆమె తన కుమారుడు సంతోష్, కోడలు జ్యోతిలతో కలిసి జీవిస్తుంది. అయితే కొడుకు, కోడలు తనను వేధిస్తున్నారని తన తండ్రి మునావత్ తథ్యుతో వాపోయింది. ఈ క్రమంలోనే శారద ఆత్మహత్యకు కుమారుడు, కోడలు కారణమని అనుమానంతో శనివారం ఆమె తండ్రి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కొనసాగుతున్న సహాయక చర్యలు


సొరంగంలోకి తాగునీరు తీసుకెళ్తున్న సహాయక బృందాలు

ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో లభ్యం కాని కార్మికుల ఆచూకీ

- కనీసం ఆనవాళ్లు కూడా లభించని వైనం
- హైడ్రాలిక్ పవర్డ్ రోబో పనితీరుపైనే ఆశలు
- డీ1 జోన్ ప్రాంతంలో బలహీనంగా పైకప్పు
- 22 రోజులు శ్రమిస్తున్న సహాయక బృందాలు


సొరంగంలోకి లోకో ట్రైన్‌లో వెళ్తున్న అన్వి రోబోటిక్ సంస్థ బృందం

అచ్చంపేట/ ఉప్పునుంతల: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్‌ఎల్‌బీసీ) సొరంగంలో చిక్కుకుపోయిన కార్మికుల కోసం అడుగడుగునా అన్వేషిస్తున్నారు. 22 రోజులు గడుస్తున్నా ఇంత వరకు వారి ఆచూకీ దొరకలేదు. మానవ ప్రయత్నంలో కొంత ఇబ్బందులు ఎదురవుతుండటంతో ఏఐ టెక్నాలజీ ద్వారా అన్వి రోబోటిక్ సంస్థ అభివృద్ధి చేసిన అటానమస్ హైడ్రాలిక్ పవర్డ్ రోబోకు అనుసంధానంగా 30 హెచ్‌పీ సామర్థ్యం గల పంపు, వాక్యూమ్ ట్యాంకు ద్వారా సహాయక చర్యలు కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శనివారం వాటిని సొరంగం వద్ద సాంకేతిక పరిజ్ఞానంతో ఇన్‌స్టాలేషన్ చేసే ప్రక్రియ మొదలుపెట్టారు. మరోవైపు సాంకేతిక సమస్యలతో రోబో యంత్రాల పనితీరు ఇంకా ప్రారంభం కాలేదు. డీ2 ప్రదేశం నుంచి డీ1 వరకు సింగరేణి, ఎన్‌డీఆర్‌ఎఫ్, హైడ్రా, ర్యాట్ హోల్ మైనర్స్ ఇతర సహాయక బృందాలు మట్టి, బురద తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. టీబీఎం ఎర్త్ కట్టర్ ఉన్న ప్రాంతం పూర్తిగా 40 అడుగుల మేర కూరుకుపోయింది. అక్కడి వరకు మనుషులు వెళ్లి సహాయక చర్యలు చేపట్టడం ఇబ్బందికరంగా ఉంది. టీబీఎం విడి భాగాలను ప్లాస్మా కట్టర్‌తో తొలగిస్తున్నారు. డీ1 డేంజర్ జోన్ ప్రాంతంలో పైకప్పు బలహీనంగా ఉండటంతో కాంక్రీట్ సెగ్మెంట్ కూడా పడిపోయే పరిస్థితి గమనించి సింగరేణి గనుల్లో ఉపయోగించే టైగర్ కారడ్స్ కలప దుంగలను సపోర్టుగా చేసుకుంటూ తవ్వకాలు జరిపేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటి వరకు వీటిని నాలుగు చోట్ల ఏర్పాటు చేశారు. వీటికి సుమారు 40 టన్నుల బరువు ఆపగలగే శక్తి ఉంది. ప్రమాదం జరిగే ముందు శబ్దం వస్తుందని, దీని వల్ల కార్మికులు సురక్షితంగా తప్పించుకునే అవకాశం ఉంటుందని సింగరేణి కార్మికులు వెల్లడించారు. డీ1 ప్రదేశానికి వెళ్లడానికి ఇంకా 30 మీటర్ల మట్టిని తొలగిస్తే సహాయక బృందాలు అక్కడికి చేరకుంటాయి. డీ1 వద్దకు చేరుకుంటే తప్ప తప్పిపోయిన కార్మికుల ఆచూకీ లభ్యమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. డీ1 వద్ద పూర్తిస్థాయిలో మట్టిని తీసేందుకు మరింత సమయం పట్టే అవకాశం ఉంది. మరో రెండు, మూడు రోజుల్లో ఆచూకీ లభ్యమయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

మార్గనిర్దేశనం చేస్తున్నాం..

ప్రమాద ప్రదేశంలో చిక్కుకున్న వారిని గుర్తించేందుకు అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయని డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్ అన్నారు. శనివారం ఉదయం సొరంగంలోని పరిస్థితులపై కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్‌తోపాటు సహాయక బృందాల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. సొరంగంలో జరుగుతున్న పురోగతిపై సమీక్షించి అవసరమైన మార్పులను అమలు చేస్తూ మార్గనిర్దేశనం చేస్తున్నట్లు వెల్లడించారు. సహాయక బృందాల మధ్య సమన్వయంతో పనులు చేపడుతున్నామని, మరింత వేగవంతం చేసేందుకు అత్యాధునిక రోబోటిక్ పద్ధతులను ఉపయోగిస్తున్నట్లు చెప్పారు. అన్వి రోబోటిక్ సంస్థ అభివృద్ధి చేసిన అటానమస్ హైడ్రాలిక్ పవర్డ్ రోబో ద్వారా 30 హెచ్‌పీ సామర్థ్యం గల పంపుతో అనుసంధానమైన వాక్యూమ్ ట్యాంకు ఉపయోగించి నీటితో కూడిన బురద, మట్టిని తొలగించనున్నట్లు తెలిపారు. సొరంగంలోని నీటిని తొలగించేందుకు డీ-వాటరింగ్ ప్రక్రియ కొనసాగుతుండగా ఆధునిక పరికరాలు ఉపయోగించి శరవేగంగా సహాయక చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ప్రత్యేకంగా ఆక్సిజన్ సరఫరా, వైద్యసేవలు, ఆహారం, మంచినీరు వంటి అవసరాలను నిరంతరం అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రాధాన్యంగా సహాయక బృందాల భద్రతకు దృష్టిలో పెట్టుకుని అత్యవసర అవసరాలపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. అనంతరం లిక్విడ్ రింగ్ వాక్యూమ్ పంపు, వాక్యూమ్ ట్యాంక్‌తో కూడిన మిషన్ పనితీరు పరిశీలించారు.

పండ్లకు భలే గిరాకీ

- ఉపవాసదీక్షలతో పెరిగిన వినియోగం
- రిటైల్‌గా జోరందుకున్న వ్యాపారం
- అమాంతంగా పెరిగిన ధరలు


దుకాణంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న పండ్లు

స్టేషన్ మహబూబ్‌నగర్: రంజాన్ మాసంలో పండ్లకు గిరాకీ ఎక్కువగా ఉంటోంది. మిగతా రోజుల కంటే ఈ మాసంలో పండ్ల వినియోగం అధికంగా ఉండడంతో ధరలు కూడా అంతేస్థాయిలో ఉన్నాయి. అరటి పండ్ల డజన్ ధర గత వారంతో పోలిస్తే రూ.5 నుంచి రూ.10 వరకు పెరిగింది. ద్రాక్ష పండ్లు అయితే కిలో రూ.80 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నారు. డిమాండ్ ఎక్కువగా ఉండడంతో ద్రాక్ష పండ్ల ధరలు పెరగడానికి కారణమని వ్యాపారులు అంటున్నారు. రంజాన్ మాసంలో ఎక్కువగా వినియోగించే కర్బుజా (పుచ్చకాయ) పండు కిలో రూ.20 నుంచి రూ.25 వరకు విక్రయిస్తున్నారు. రిటైల్ మార్కెట్లో పండ్ల విక్రయాలు జోరందుకున్నాయి. రంజాన్ ఉపవాసదీక్షలో ముస్లింలు రోజు సాయంత్రం ఇఫ్తార్ వేళ పండ్లు ఎక్కువగా తీసుకుంటారు. యాపిల్, ఖర్జూర, పుచ్చకాయలు, పైనాపిల్, దానిమ్మ, ద్రాక్ష, బత్తాయి, బొప్పాయి, అరటి, సపోట వంటి పండ్ల వినియోగం పెరగడంతో వీటి ధరల్లో రోజురోజుకు మార్పు కనిపిస్తుంది. ముస్లింలకు ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులకు భారీఎత్తున పండ్లు అవసరమవుతాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని పండ్ల ధరలను అమాంతంగా పెంచేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్, అశోక్ టాకీస్ చౌరస్తా, జనరల్ ఆస్పత్రి, న్యూటౌన్, క్లాక్‌టవర్, అంబేడ్కర్ చౌరస్తా, పద్మావతికాలనీతోపాటు ఇతర ప్రాంతాల్లో పండ్ల స్టాళ్లను ఏర్పాటు చేశారు. రూ.20 నుంచి 25 వరకు ఉన్న యాపిల్ రంజాన్ మాసంలో రూ.30 నుంచి 35 వరకు, ఆరెంజ్ పండ్లు డజన్ ప్రకారం రూ.180 నుంచి 200 వరకు అమ్ముతున్నారు.

మార్కెట్లో వివిధ రకాల పండ్ల ధరలు

యాపిల్	రూ.25-30(ఒకటి)
ద్రాక్ష	రూ.80-100(కిలో)
దానిమ్మ	రూ.25-30(ఒకటి)
బత్తాయి	రూ.15-20(ఒకటి)
బొప్పాయి	రూ.50-60 (కిలో)
ఖర్బూజ	రూ.20-25 (కిలో)
అరటి	రూ50-60(డజన్)
సపోట	రూ.40-50 (కిలో)

ధరలు అందరికీ అందుబాటులో ఉండాలి



రంజాన్ మాసంలో ఉపవాస దీక్షల సందర్భంగా పండ్ల వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఈసారి కూడా పండ్ల ధరలు ఎక్కువగానే ఉన్నాయి. పెరిగిన ధరలతో పండ్లను కొనుగోలు చేయలేని పరిస్థితి. పండ్ల ధరలు పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉంటే బాగుంటుంది.

– జహంగీర్‌బాబా, సద్దల్‌గుండు, మహబూబ్‌నగర్

దారిదోపిడీకి యత్నించిన ముఠా అరెస్ట్




వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ , స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలు

- 10 తులాల బంగారం, 22 తులాల వెండి ఆభరణాల స్వాధీనం
- వివరాలు వెల్లడించిననాగర్‌కర్నూల్ ఎస్పీ

నాగర్‌కర్నూల్ క్రైం: జల్సాలకు అలవాటుపడి దారి దోపిడీకి యత్నించిన ఓ ముఠాను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో సమావేశం ఏర్పాటుచేసి వివరాలు వెల్లడించారు. వనపర్తికి చెందిన బొల్లెమోని బాబు, బొల్లెమోని అంజి, పుట్టపాకుల శ్రీకాంత్, హైదరాబాద్‌కు చెందిన నందిమళ్ల హరిగణేశ్, యాత రవి, పెంట్లవెల్లికి చెందిన గిరిధర్‌నాయుడు, సాయికుమార్, హరికృష్ణ, అఖిల్ జల్సాలకు అలవాటుపడి చోరీలకు పాల్పడుతుండేవారు. పెంట్లవెల్లికి చెందిన రాజవర్ధన్, వెంకటేశ్వర్లు, రమేష్, రాఘవేంద్రాచారి బంగారు వ్యాపారులు. వీరంతా ఈ నెల 6న బంగారు కొనుగోలుకు హైదరాబాద్ బయలుదేరారు. నిందితుడు సాయికుమార్ ఈ సమాచారాన్ని బొల్లెమోని బాబుకు అందించడంతో పాటు హరికృష్ణ, గిరిధర్ నాయుడుకు ఓ అద్దె కారు, సెల్‌ఫోన్ అప్పగించి బంగారు వ్యాపారస్తుల కారు వెంటే వెళ్తూ ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. ఆ వ్యాపారులు హైదరాబాద్‌లోని కాళీకమాన్ వద్ద బంగారు కొనుగోలు చేసి బయలుదేరగా నిందితులు మిగతా వారిని అప్రమత్తం చేయడంతో పాటు వారి వెంటే వచ్చారు. కొల్లాపూర్ మండలం అంకిరావుపల్లి శివారు కేఎల్‌ఐ వంతెన వద్ద స్వామి, అంజి రాళ్లు అడ్డుపెట్టడంతో పాటు సిమెంట్ దిమ్మెలను, అఖిల్ తల్వార్‌ను చేతిలో పట్టుకోవడంతో పాటు హరిగణేష్, రవి, శ్రీకాంత్ రోడ్డు పక్కన నిలిచి ఉన్నారు. బంగారు వ్యాపారుల కారు అక్కడికి చేరుకోగానే నిందితులు కారుపై సిమెంట్ దిమ్మెలతో దాడి చేసేందుకు యత్నించగా అప్రమత్తమైన డ్రైవర్ చాకచక్యంగా అక్కడి నుంచి వేగంగా తప్పించుకొని వెళ్లిపోయారు. బంగారు వ్యాపారి రాజవర్ధన్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని గాలింపు చేపట్టారు. శుక్రవారం రాత్రి కొల్లాపూర్‌లో పెట్రోల్‌బంక్ వద్ద వాహన తనిఖీలు చేపడుతుండగా బొల్లెమోని బాబు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తమదైన శైలిలో విచారించగా నేరాన్ని అంగీకరించడంతో పాటు మిగతా వారి సమాచారం ఇవ్వడంతో ఏడుగురిని అరెస్టు చేశారు. వీరంతా వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో 24 చోట్ల చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి వేర్వేరు దొంగతనాలకు సంబంధించి 10 తులాల బంగారం, 22 తులాల వెండి ఆభరణాలు, దారి దోపిడీకి యత్నించిన కారు, రెండు మోటారు సైకిళ్లు, ఏడు సెల్‌ఫోన్లు, కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తామని.. కోర్టు అనుమతితో మరోమారు పోలీస్ కస్టడీకి తీసుకొని విచారిస్తామని చెప్పారు.

షార్ట్ సర్క్యూట్‌తో వస్త్ర దుకాణం దగ్ధం

రూ. 3లక్షల ఆస్తినష్టం

మక్తల్: షార్ట్ సర్క్యూట్‌తో వస్త్ర దుకాణం దగ్ధమైన ఘటన మక్తల్ పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఊట్కూరు మండలం తిప్రాస్‌పల్లికి చెందిన అశోక్ మక్తల్‌లోని సంగం బండ రోడ్డులో బట్టల షాపు నిర్వహిస్తున్నారు. రోజు మాదిరిగానే శనివారం రాత్రి 8 గంటలకు షాపును మూసివేసి ఇంటికి బయలుదేరారు. అతడు వెళ్లిన కొద్ది సేపటికే షాపులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకున్న అశోక్ అక్కడికి చేరుకొని ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైర్‌స్టేషన్ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే దుకాణంలోని సగానికి పైగా వస్త్రాలు కాలిపోయాయి. దాదాపు రూ. 3లక్షలకు పైగా ఆస్తినష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయారు. దగ్ధమైన షాపును సీఐ రాంలాల్, ఎస్‌ఐ బాగ్యలక్ష్మీరెడ్డి పరిశీలించారు.


దగ్ధమైన వస్త్ర దుకాణం

తాళం వేసిన ఇంట్లో చోరీ

బిజినేపల్లి: మండలంలోని లట్టుపల్లిలో కృష్ణమోహన్ ఇంట్లో చోరీ జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గ్రామంలో కిరాణ దుకాణం నిర్వహిస్తున్న కృష్ణమోహన్ ఇంటికి తాళం వేసి శుక్రవారం యాదాద్రికి వెళ్లారు. శనివారం తిరిగి ఇంటికి వచ్చి చూసే సరికి తాళం తీసి ఉంది. లోపలికి వెళ్లి చూడగా మూడున్నర తులాల బంగారం, రూ.50 వేలు చోరీ అయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భవన నిర్మాణం పూర్తయ్యేదెన్నడో..?

- 2022లో మంజూరైన వడ్డేపల్లి పురపాలక సంఘ కార్యాలయ భవనం
- రెండేళ్లు దాటినా పూర్తికాని నిర్మాణం
- శిథిలావస్థకు చేరిన భవనంలోనే కార్యాలయ నిర్వహణ


పిల్లర్ల దశలోనే నిలిచిన మున్సిపల్ నూతన భవన నిర్మాణం

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ నూతన భవన నిర్మాణం పూర్తయ్యేదెన్నడోనని అటు కార్యాలయ సిబ్బంది, ఇటు పట్టణ వాసులు వాపోతున్నారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే మున్సిపల్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. భవనం శిథిలావస్థకు చేరడం, ఇరుకుగా ఉండటంతో 2022 నవంబర్ నెలలో మున్సిపల్ శాఖ నుంచి నూతన భవన నిర్మాణానికి రూ.1.50 కోట్లకు ప్రొసీడింగ్స్ వచ్చాయి. టెండర్ నిర్వహించిన కాంట్రాక్టర్ అదే సంవత్సరం డిసెంబర్ 1న భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఆరు నెలలపాటు పనులు చేపట్టిన కాంట్రాక్టర్ బిల్లులు మంజూరు కాకపోవడంతో మధ్యలోనే పనులు నిలిపేసి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి రెండేళ్లుదాటినా పనులు మొదలుపెట్టలేదు. దీంతో ఎక్కడవేసిన గొంగడి అక్కడే ఉందన్న చందంగా ఉంది కార్యాలయ భవన నిర్మాణ పనులు. ఉన్నతాధికారులు స్పందించి భవన నిర్మాణాన్ని పూర్తిచేయాలని కార్యాలయ సిబ్బంది, పుర ప్రజలు కోరుతున్నారు.


శిథిలావస్థకు చేరిన పాతగ్రామ పంచాయతీ భవనం

ఇరుకు గదుల్లో నిర్వహణ

గ్రామ పంచాయతీకి అనుగుణంగా కట్టించిన పాత కార్యాలయంలోనే మున్సిపల్ వ్యవహారాలు నిర్వహిస్తుండటంతో భవనం ఇరుకుగా మారింది. కంప్యూటర్, టెక్నికల్ స్టాఫ్, ఇంజినీరింగ్‌శాఖ, టౌన్‌ప్లానింగ్ అధికారులు, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్, కార్యాలయ సిబ్బంది విధులు నిర్వహించాల్సి వస్తోంది. దీనికి తోడు వర్షాకాలంలో పైకప్పు నుంచి నీరు కారుతూ ఇబ్బందికరంగా ఉందని అధికారులు పేర్కొన్నారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వెళ్లిన వారు కూర్చోడానికి అవకాశం లేకుండా పోయిందని గంటల తరబడి నిల్చొని పనులు చేయించుకోవాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు.

పిల్లర్లకే పరిమితమైన పనులు

భవన నిర్మాణానికి రూ.1.50 కోట్లు నిధులు మంజూరు కావడంతో వడ్డేపల్లి వసంతమాధవ స్వామి ఆలయ సమీపంలోని ప్రభుత్వ స్థలంలో కార్యాలయం నిర్మించడానికి పనులు మొదలు పెట్టారు. బేస్‌మెంట్ పనులు పూర్తిచేసి పిల్లర్లు వేసి వదిలేశాడు. బిల్లులు మంజూరు కాకపోవడంతో పనులు నిలిపేసినట్లు సదరు కాంట్రాక్టర్ తెలిపారు.

ఇబ్బందికరంగా ఉంది..



ఇరుకు భవనంలో మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తుండటంతో ఇబ్బందికరంగా ఉంది. పనుల నిమిత్తం కార్యాలయానికి వెళ్తే కనీసం కూర్చోడానికి అవకాశం లేదు. నూతన భవన నిర్మాణ పనులు పూర్తి చేయించి సౌకర్యంగా ఉండేలా చూడాలి.

- విక్రమ్, శాంతినగర్

చెట్ల కిందనే పడిగాపులు..



పాత భవనంలో కనీస సౌకర్యాలు లేవు. గట్టు మీద నిర్మిస్తున్న నూతన భవన నిర్మాణ పనులు తొందరగా పూర్తిచేసి కార్యాలయాన్ని అందులోకి మార్చాలి. కార్యాలయానికి పనిమీద వెళ్లిన వారంతా చెట్ల కింద పడిగాపులు కాయాల్సి వస్తోంది.

-వెంకటేష్, వడ్డేపల్లి మున్సిపాలిటీ

బిల్లులు మంజూరు కావాలి



సదరు కాంట్రాక్టర్‌కు గతంలో నిర్మించిన పనులకు సంబంధించిన బిల్లులు మంజూరు కాలేదు. బిల్లులు మంజూరైన అనంతరం భవన నిర్మాణ పనులు పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా చూస్తాం.

-రాజయ్య, కమిషనర్, వడ్డేపల్లి మున్సిపాలిటీ

క్లుప్తంగా

'చలో పార్లమెంట్' జయప్రదం చేయండి

గద్వాల: రవాణా రంగాన్ని రక్షించుకోవడానికి, కార్మికుల సమస్యల పరిష్కారానికి మార్చి 24న నిర్వహించనున్న చలో పార్లమెంట్‌ను జయప్రదం చేయాలని తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్ ఫెడరేషన్ సీఐటీయూ అనుబంధ జిల్లా అధ్యక్షుడు మశపోగు వెంకటేశ్వర్లు కార్మికులకు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆటో కార్మికులతో కలిసి చలో పార్లమెంట్ కరపత్రాలు విడుదల చేశారు. కార్మికులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మహేష్, హరిబాబు, గోపాల్, కృష్ణ, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటివైద్య శిబిరం



గట్టు: మండల పరిధిలోని తుమ్మలచెరువు గ్రామంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఎల్‌టీఐ మైండ్‌ట్రీ, భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. కంటి వైద్యుడు అశ్రఫ్ 200 మందికి పరీక్షలు నిర్వహించి, మందులు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రాగిణి, జిలాని, నాగరాజు, ఆశ కార్యకర్త విజయలక్ష్మి, శ్రీదేవి, హలీంపాష, శాంతన్న, ఆంజనేయులు, నర్సింహులు, నరేష్, జయన్న, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



అయిజ: మండలంలోని వెంటకాపురంలో శనివారం సీసీరోడ్డు నిర్మాణ పనులను గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వాతి ప్రారంభించారు. ఎస్‌ఆర్‌ఈజీఎస్ నిధులు ద్వారా రూ.5 లక్షల నిధులతో రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రేపు టెంకాయల విక్రయ వేలం

మల్దకల్: మండలంలోని సద్దలోనిపల్లి కృష్ణస్వామి ఆలయంలో సోమవారం టెంకాయల వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ పురందర్ ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని సూచించారు. ఉదయం 10 గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

దళిత ఉపాధ్యాయుల సస్పెన్షన్ ఎత్తివేయాలి

పాన్‌గల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దళిత ఉపాధ్యాయుల సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని, విద్యార్థుల సమక్షంలో నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేయాలని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సందె కార్తీక్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పవన్ కుమార్, బీఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి దాసు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయా విద్యార్థి సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని నిరసన తెలిపారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం విజయ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గంధం లక్ష్మయ్య, కళ్యాణ్, రామకృష్ణ, స్వామి, ప్రభాస్, తరుణ్, వినోద్, శ్రీను, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారు'



ఆత్మకూర్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయలేక కాంగ్రెస్ ప్రభుత్వం ప్రశ్నించే గొంతుకలను నొక్కుతుందని మాజీ ఎంపీపీలు శ్రీధర్‌గౌడ్, బంగారు శ్రీను, విరేశలింగం, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక గాంధీచౌక్‌లో మాజీమంత్రి జగదీశ్వర్‌రెడ్డికి మద్దతుగా రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో కోటేష్, రామకృష్ణ, చెన్నయ్య, సోంబాబు, జానకీరాం, రియాజ్, విష్ణురెడ్డి, అంజి తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు


గట్టులో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు


ధరూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు

ధరూరు/గట్టు/మానవపాడు: ధరూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు చీఫ్ సూరింటెండెంట్ సత్యనారాయణ, డిపార్ట్‌మెంటల్ అధికారి శేఖర్ తెలిపారు. శనివారం పరీక్షలకు 367 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. పరీక్షలను డీఈసీ మెంబర్స్ పద్మావతి, దేవేందర్‌రెడ్డి తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు.

- గట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 268 మంది విద్యార్థులకు గాను 262 మంది పరీక్షలకు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ కేఎస్‌డీ రాజు, డిపార్టుమెంటల్ అధికారి కాశీవిశ్వనాథ్ తెలిపారు.
- మానవపాడు మండల కేంద్రంలోని శ్రీగంగు వెంకటకృష్ణరెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షకు 109 మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు.

బకాయి బిల్లులు విడుదల చేయాలి


మాట్లాడుతున్న రమేష్

గద్వాలటౌన్: ట్రెజరీలో ఆమోదం పొంది ఈ–కుబేర్‌లో బకాయిలో ఉన్న అన్ని రకాల బిల్లులను వెంటనే విడుదల చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్ డిమాండ్ చేశారు. శనివారం జరిగిన ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత రెండున్నర సంవత్సరాలుగా సెలవు జీతాలు, సప్లిమెంటరీ వేతనాలు, మెడికల్ బిల్లులు, జీపీఎఫ్, పెన్షన్, జీఎల్ఐ తదితర బిల్లులు విడుదల కాకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గత మార్చి నుంచి పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు గ్రాట్యూటీ, కమ్యూటేషన్ మొత్తాలను చెల్లించకపోవడంతో పెన్షనర్లు అవస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బకాయి పడిన నాలుగు వాయిదాల డీఏలను వెంటనే ప్రకటించాలన్నారు. పీఆర్సీ నివేదికను ఉద్యోగ సంఘాలతో చర్చించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీవో 317ను సవరించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు గోపాల్, వెంకటరమణ, చక్రధర్, చంద్రకాంత్, తిలక్, రాజశేఖర్, ఆంజనేయులు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి


భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ రవీంద్రబాబు

ధరూరు: మండల పరిధిలోని గుడ్డెందొడ్డి గ్రామ శివారులోని రెసిడెన్సియల్ గురుకుల పాఠశాలను ఎంఈఓ రవీంద్రబాబు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు జరుగుతున్న పరీక్షలు పరిశీలించారు. రికార్డులు పరిశీలించి మధ్యాహ్న భోజనంపై ఆరా తీశారు. పాఠశాల పరిసరాలు పరిశీలించి పరిశుభ్రత పాటించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఝాన్సీరాణి, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పని ప్రదేశంలో వసతులు కల్పించాలి

మానవపాడు: ఎక్కువ మంది కూలీలు ఉపాధి హామీ పనులకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ భాస్కర్ ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు. శనివారం మండల కేంద్రంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధి పనులను ప్రజలు వినియోగించుకునేలా చూడాలన్నారు. పని ప్రదేశం వద్ద వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ విజయ్‌శంకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలించిన ఎంపీడీఓ

శాంతినగర్: వడ్డేపల్లి మండల పరిధిలోని రామాపురం, జిల్లెడుదిన్నె గ్రామ శివారులోని పొలాల్లో చేపడుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ రామకృష్ణ శనివారం పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని పొలాల్లో చేస్తున్న వాలుకట్టలు, ముళ్ల కంపల తొలగింపు పనులు, రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

508 మద్యం బాటిళ్లు ధ్వంసం


పట్టుబడిన మద్యంతో పోలీసులు

ధరూరు: 2023–24 సంవత్సరంలో వివిధ సందర్భాల్లో నమోదైన 39 రకాల కేసుల్లో పట్టుబడిన 508 మద్యం బాటిళ్లను శనివారం ధ్వంసం చేసినట్లు ఎస్ఐ శ్రీహరి తెలిపారు. స్థానిక స్టేషన్ వద్ద పోలీసులు, ఎక్సైజ్ అధికారుల సమక్షంలో ధ్వంసం చేశామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగి వాహనం నడిపితే చర్యలు

మద్యం తాగి వాహనం నడిపిన వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీహరి హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేసి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు

అయిజ: ప్రతిభ ఉత్సవాల్లో భాగంగా ఫిబ్రవరి నెలలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎఫ్ఎల్ఎన్ పోటీల్లో మండలం కేంద్రంలోని భరత్‌నగర్ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న ప్రజీత్‌కుమార్ జిల్లాస్థాయిలో మొదటి బహుమతి గెలుచుకున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం ఎంఈఓ రాములు ఉపాధ్యాయులుతో కలిసి విద్యార్థికి శాలువా కప్పి అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, ఎఎఫ్ఎన్ ఆర్పీలు బాలకృష్ణ, సుకుమార్, ఉపాధ్యాయులు వెంకటేష్, పరమేశ్వరి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

మల్దకల్: ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రసవాల సంఖ్య పెంచి మెరుగైన వైద్యసేవలందించాలని ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సంధ్యా కిరణ్మయి వైద్య సిబ్బందికి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున ఆరోగ్య ఉప కేంద్రాల్లో ఓఆర్ఎస్ పాకెట్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. గర్భిణులు, బాలింతల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ స్వరూపరాణి, కోఆర్డినేటర్ శ్యాంసుందర్, సీహెచ్ఓ వెంకటస్వామి, సులోచన, రామస్వామి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన పీహెచ్‌సీ


పెచ్చులూడిపడిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

అయిజ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం శిథిలావస్థకు చేరిందని, తక్షణమే నూతన భవనాన్ని నిర్మించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం పీహెచ్‌సీని స్థానిక బీజేపీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఆస్పత్రి భవనం శిథిలమయ్యిందని, 30 పడకల ఆస్పత్రి పనులు నిలిచిపోయిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. పీహెచ్‌సీలో పెచ్చులూడిపడిన ప్రదేశంలో రోగులు లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిందన్నారు. శిథిల భవనాన్ని కూల్చివేసి నూతన భవనం నిర్మించాలని లేనియెడల నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

గద్వాల: హెచ్‌ఎంవీ హెవీ మోటార్ వాహనం, ఎల్‌ఎంవీ తేలికపాటి మోటార్ వాహనం డ్రైవింగ్ కోర్సు శిక్షణ కోసం బీసీ నిరుద్యోగ యువతీ యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెనుకబడిన తరగతుల అభివృద్ధి జిల్లా అధికారి రమేష్ బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రైవింగ్ శిక్షణ కాలం 38 రోజులు ఉంటుందని, శిక్షణ పూర్తి అయిన అనంతరం అర్హత కలిగిన అభ్యర్థులకు సంబంధిత రవాణ సంస్థ పర్మినెంట్ లైసెన్స్ ఉచితంగా అందిస్తుందన్నారు. శిక్షణ సమయంలో అభ్యర్థులకు భోజనం, ఉచిత సౌకర్యం అందిస్తున్నట్లు తెలిపారు. 8వ తరగతి ఉత్తీర్ణత కలిగి 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల వారు ఆధార్‌కార్డు, కులధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, పాస్‌ఫోటోతో ఈనెల 15 నుంచి 31వ తేది సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

సుఖ సంతోషాలతో ఉండాలి



శాంతినగర్: పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలకు స్థానిక పెద్ద మస్జిద్‌లో శనివారం ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. మౌలానా రజాక్, కలీముల్లాలు ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లింలు విందులో పాల్గొన్నారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థనలు చేసినట్లు వారు పేర్కొన్నారు.

కాన్షీరాం ఆశయాలు కొనసాగించాలి


ఎర్రవల్లిలో కాన్షీరాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు


గద్వాలలో నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు

గద్వాల/ఎర్రవల్లి: బహుజనులు రాజ్యాధికారం కోసం వ్యక్తిగత జీవితం త్యాగం చేసిన కాన్షీరాం ఆశయాలు కొనసాగించాలని బహుజన రాజ్యసమితి యువజన కాంగ్రెస్ నాయకుడు రవి అన్నారు. కాన్షీరాం జయంతి సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బహుజన ఉద్యమకారులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, మధుసూదన్‌బాబు, ప్రభాకర్, అతికూర్ రహిమాన్, కుర్వపల్లయ్య, వినోద్, సుభాన్, తదితరులు పాల్గొన్నారు.

- ఎర్రవల్లి మండల కేంద్రంలో బీఎస్పీ ఆధ్వర్యంలో ఆ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరాం 91వ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఎస్పీ ద్వారానే దేశంలో అత్యధిక జనాభా ఉన్న బీసీలకు రిజర్వేషన్లను అప్పటి ప్రభుత్వం కల్పించిందన్నారు. బుల్లెట్ ద్వారా కాకుండా కేవలం బ్యాలెట్ ద్వారానే రాజ్యాధికారం సాధిస్తామని చెప్పిన మహనీయుడు కాన్షీరాం అని కొనియాడారు. ప్రతి ఒక్కరూ కాన్షీరాం ఆశయాలు కొనసాగించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు మణికుమార్, శివవర్మతేజ, మోహన్‌రాజు, బొజ్జన్న, బుచ్చన్న, నాగరాజు, రాముడు, శాంతిరాజు, రామారావు, జయ్యన్న, తిమ్మరుషు, నిరంజన్, ఆశన్న, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


ధర్మాపూర్‌లో సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం

మహబూబ్‌నగర్ రూరల్: గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని ధర్మాపూర్ గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా రూ. 50 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు ఎంపీ డీకే అరుణతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహబూబ్‌నగర్ అభివృద్ధికి కేంద్రం నుంచి అత్యధిక నిధులు తెచ్చి, మహబూబ్‌నగర్ అభివృద్ధికి సహకరించాలని ఎంపీకి విజ్ఞప్తి చేశారు. ప్రతి గ్రామానికి, తండాలకు సైతం రోడ్లు, కాల్వల నిర్మాణ పనులు తప్పక కల్పించాలనే కృతనిశ్చయంతో ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు రాజుగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యం పెంచేందుకు కృషి


ఉత్తనూరులో విద్యార్థులకు కృత్రిమ మేధ ద్వారా పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు

మల్దకల్: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకే ప్రాథమిక స్థాయిలో ఏఎక్స్ఎల్ ప్రోగ్రాం ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్ అన్నారు. శనివారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వం ఏఎక్స్ఎల్ ప్రోగ్రాం రెండో దశ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ల్యాబ్‌ను ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, తహసీల్దార్ షాహిదాబేగంలతో కలిసి ప్రారంభించారు. అదే విధంగా అమరవాయి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ.. విద్యార్థులలో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకే ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం నరేష్, ఉపాధ్యాయులు సరస్వతి, రవి, సుమలత, అరుణ, రిజ్వానా, జరీనాబేగం, బజారన్న, ఈశ్వరీబాయి, లక్ష్మి, ప్రశాంతి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐ ద్వారా విద్యాబోధన

గట్టు: విద్యార్థులకు ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) ద్వారా విద్యా బోధన అందిస్తున్నట్లు ఎంఈఓ నల్లారెడ్డి తెలిపారు. శనివారం తప్పెట్లమొర్సు ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం అగస్టిన్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రఘులక్ష్మణ్‌తో కలసి అండ్స్ ఆన్ యాక్టివిటీ కార్యక్రమాన్ని మండల పరిషత్ ప్రాథమిక చాగదోన, ఇందువాసి పాఠశాలల్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏఐ ద్వారా విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా విద్యాబోధన, ఇతర అంశాలపై అవగాహన కలిప్తస్తున్నట్లు తెలిపారు. ఏఐ టూల్స్‌ను విద్యార్థులు ఆసక్తిగా తిలకించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు చిన్నతనం నుంచే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ఆసక్తిని పెంచుకుని భవిష్యత్‌లో నవకల్పనలు సాధించే దిశగా అడుగులు ముందుకు పడుతున్నట్లు పేర్కొన్నారు.

ఆధునిక సాంకేతికత అలవర్చుకోవాలి

అయిజ: సాంకేతికత పరిజ్ఞానం రోజురోజుకు కొత్త పుంతలు తొక్కుతుందని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎంఈఓ రాములు అన్నారు. మండలంలోని ఉత్తనూరు, భూంపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏఐ ద్వారా విద్యార్థులకు బోధన పాఠాలు ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలల్లో ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్ట్ కింద రెండో విడతలో జిల్లాలో 24 ప్రాథమిక పాఠశాలల్లో కృత్రిమ మేధ ద్వారా విద్యార్థులకు బోధన అందించే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఉత్తనూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు మల్లేష్, చంద్రకళ, పారిజాత, పర్వీన్ బేగం, రిసోర్స్ పర్సన్లు బాలకృష్ణ, సుకుమార్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈనాడు ఆస్తుల జప్తు

గూడవల్లి వద్ద ఉన్న ఆస్తులపై కోర్టు ఆదేశం
- ఆ ఆస్తులను ఎవరికీ బదలాయించరాదు
- తాకట్టుపెట్టడం, విక్రయించడం, బహుమతిగా ఇవ్వడం కుదరదు
- విజయవాడలో లీజు గడువు ముగిసినా ఖాళీ చేయని ఈనాడు
- స్థల యజమానికి రూ.5.2 కోట్లను 6 శాతం వడ్డీతో చెల్లించాలని గతంలో ఆదేశించిన కోర్టు
- పట్టించుకోని ఈనాడు యాజమాన్యం.. దాంతో ఈనాడు ఆస్తుల జప్తు కోరిన బాధితుడు
- గతంలో విశాఖ స్థల యజమానికీ ముప్పుతిప్పలు..
- కొనసాగుతున్న ఈనాడు దౌర్జన్యం.. కోర్టులు ఆదేశించినా లెక్కలేనితనం



సాక్షి, అమరావతి: అందరికీ నిత్యం ఉదయాన్నే నీతులు చెప్పే ఈనాడు (ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్) దౌర్జన్యం కొనసాగుతోంది. తమ పత్రిక ద్వారా జనాలకు నీతులు మాత్రమే చెబుతామని, వాటిని తాము మాత్రం ఆచరించమని ఈనాడు మరోమారు నిరూపించింది. గతంలో విశాఖపట్నం ఈనాడు కార్యాలయం స్థలం విషయంలో దాని యజమాని ఆదిత్య వర్మను ముప్పుతిప్పలు పెట్టిన ఈనాడు యాజమాన్యం, ఇప్పుడు విజయవాడలో ఉన్న కార్యాలయ స్థలం విషయంలో కూడా దాని యజమాని ముసునూరు అప్పారావును సైతం అలాగే ముప్పుతిప్పలు పెడుతోంది. ఈనాడు పత్రిక కోసం తీసుకున్న స్థలం లీజు గడువు ముగిసినా.. దాన్ని అప్పారావుకు అప్పగించకుండా చుక్కలు చూపిస్తోంది. కోర్టుకెళ్లి అప్పారావు విజయం సాధించినా.. న్యాయస్థానం ఆదేశాలను సైతం ఈనాడు బేఖాతరు చేసింది. దీంతో కోర్టు ఈనాడు తీరును తీవ్రంగా ఆక్షేపించింది. స్థల యజమానిని వేధించడానికే ఆ స్థలాన్ని ఖాళీ చేయడం లేదని కూడా ఘాటుగా వ్యాఖ్యానించింది.

కాగా.. బాధితుడు అప్పారావుకు రూ.5.20 కోట్లను 6 శాతం వార్షిక వడ్డీతో పరిహారం చెల్లించాలంటూ కోర్టు ఇచ్చిన ఆదేశాలను సైతం ఈనాడు యాజమాన్యం పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ఈనాడు ఆస్తుల జప్తునకు న్యాయస్థానం తాజాగా ఆదేశాలు ఇచ్చింది. విజయవాడ గ్రామీణ మండలం గూడవల్లిలో ఉన్న ఈనాడు ఆస్తులను బదలాయించడం, తాకట్టు పెట్టడం, అమ్మడం, బహుమతిగా ఇవ్వడం చేయరాదని ఈనాడు యాజమాన్యాన్ని ఆదేశించింది. ఈ ఆస్తులను ఎవరూ కొనడం, బహుమతిగా తీసుకోవడం చేయరాదంది. తదుపరి ఆదేశాలు ఇచ్చేంతవరకు ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేసింది. ఆ రోజు విచారణకు వ్యక్తిగతంగా హాజరు కావాలని ఈనాడు ఎండీ కిరణ్‌ను ఆదేశించింది.

అసలు కథ ఏమిటంటే..

ఈనాడు యజమాని రామోజీరావు 1975లో విజయవాడ పటమట లంకలో ముసునూరి అప్పారావుకు చెందిన 92 సెంట్ల స్థలాన్ని 33 ఏళ్ల పాటు లీజుకు తీసుకున్నారు. నెలకు రూ.725 అద్దె చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ పక్కనే అప్పారావు సమీప బంధువైన వల్లూరు వెంకటేశ్వరరావుకు చెందిన ఎకరా 47 సెంట్ల భూమిని కూడా రామోజీరావు లీజుకు తీసుకున్నారు. లీజు గడువు 30.04.2008న ముగిసింది. దీంతో మరో 33 ఏళ్ల పాటు లీజు పొడిగించాలని స్థల యజమాని అప్పారావును రామోజీరావు కోరారు. రామోజీ సంగతి బాగా తెలిసిన అప్పారావు లీజు పొడిగింపునకు నిరాకరించారు. 6 నెలల్లో స్థలాన్ని ఖాళీ చేసి ఇవ్వాలని రామోజీరావుకు తేల్చిచెప్పారు. 6 నెలల గడువు 2008 అక్టోబర్‌తో ముగిసింది. అయినా రామోజీరావు ఆ స్థలాన్ని ఖాళీ చేయలేదు. ఇదే సమయంలో మరో 33 ఏళ్లపాటు లీజు పొడిగించేలా అప్పారావును ఆదేశించాలంటూ విజయవాడ జిల్లా కోర్టులో రామోజీరావు సూట్ దాఖలు చేశారు. దానిని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు 2013లో కొట్టేసింది. అప్పారావుకు చెందిన స్థలంపై ఈనాడుకు ఎలాంటి హక్కు లేదని తేల్చింది. అంతేకాక ఈనాడు ఆ స్థలంలో ఉండటం అక్రమమేనని స్పష్టం చేసింది. దీనిపై ఈనాడు అప్పీల్ దాఖలు చేసింది. ఈ అప్పీల్‌ను సైతం కోర్టు కొట్టేసింది.

పరిహారంగా రూ.5.20 కోట్లు చెల్లించాలని కోర్టు ఆదేశించినా..

ఈ నేపథ్యంలోనే 2015లో ముసునూరి అప్పారావు తన స్థలం నుంచి ఈనాడును ఖాళీ చేయించాలని కోరుతూ విజయవాడ కోర్టులో సూట్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు అప్పారావుకు అనుకూలంగా తీర్పునిచ్చింది. దాదాపు 60 పేజీల తీర్పు వెలువరించింది. 2012–15 వరకు అప్పారావుకు రూ.5.20 కోట్లను 6శాతం వార్షిక వడ్డీతో పరిహారంగా చెల్లించాలని ఈనాడు యాజమాన్యాన్ని ఆదేశించింది. మిగిలిన కాలానికి పరిహారం కోసం పిటిషన్ దాఖలు చేసుకునే వెసులుబాటును అప్పారావుకు ఇస్తూ 2024 అక్టోబర్ 3న తీర్పునిచ్చింది. అయితే.. ఈ తీర్పును ఈనాడు బేఖాతరు చేసింది. దీంతో తీర్పు అమలుకు అప్పారావు కింది కోర్టులో ఈపీ దాఖలు చేశారు. విజయవాడ గ్రామీణ మండలం గూడవల్లిలో ఉన్న ఈనాడు కార్యాలయాన్ని జప్తు చేయాలని అందులో కోరారు. దానిపై విచారణ జరిపిన కోర్టు తాము ఇచ్చిన ఆదేశాల మేరకు రూ.5.20 కోట్ల పరిహారం చెల్లించడంలో ఈనాడు విఫలమైందని తేల్చింది. ఇందుకు గాను ఈనాడు ఆస్తుల జప్తునకు ఆదేశిస్తున్నట్టు ఈ నెల 7న ఉత్తర్వులు జారీ చేసింది. ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ ఎండీ కిరణ్ వ్యక్తిగత హాజరుకు ఆదేశాలిస్తూ విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేసింది.

భారత్.. ఆధ్యాత్మిక స్ఫూర్తి

▶ మొదటి పేజీ తరువాయి

సూచించారు. ఆధ్యాత్మికాన్ని పెంపొందించడంలో బ్రహ్మకుమారీల పాత్ర అభినందనీయమన్నారు. మితిమీరిన 'ఇన్‌స్టంట్'కు అలవాటుపడితే అనారోగ్యాన్ని ఆహ్వానించినవారవుతారని హెచ్చరించారు.

ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వండి: జస్టిస్ ఎస్వీ భట్టి

న్యాయమూర్తులు, న్యాయవాదులు సానుకూల దృక్పథంతో ముందుకు సాగినప్పుడే అసాధ్యాలు కూడా సుసాధ్యం కాగలవని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సారస వెంకటనారాయణ భట్టి చెప్పారు. న్యాయవాదులకు స్వీయ అవగాహన ఉండాలని, కేసును, కక్షిదారుడిని అర్థం చేసుకున్నప్పుడే సమర్థ వాదన సాధ్యపడుతుందన్నారు. గెలుపోటములను ఒకేలా స్వీకరించాలని.. అపజయానికి కుంగిపోవడం, విజయానికి పొంగిపోవడం వృత్తినే కాదు, వ్యక్తిత్వాన్నీ దెబ్బతీస్తాయని వ్యాఖ్యానించారు. ఏం చేస్తున్నాం.. ఎలా చేస్తున్నాం.. అనే సమీక్ష అందరికీ అవసరమన్నారు. వృత్తిపరంగా ప్రతికూల ఆలోచనలు వస్తుంటాయని.. కొన్నిసార్లు మనసు కలుషితం అవుతుందని చెప్పారు. సానుకూలత లేకుండా సరైన నిర్ణయం తీసుకోలేమని చెబుతూ.. జరిగిందేదో జరిగిపోయింది.. సానుకూలంగా ముందుకెళ్తాను అనే ధోరణిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి, జస్టిస్ సూరేపల్లి నంద, జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి, త్రిపుర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్, మాజీ న్యాయమూర్తులు జస్టిస్ వి.ఈశ్వరయ్య, జస్టిస్ బీడీ రాథి, బార్ కౌన్సిల్ మాజీ చైర్మన్ ఎం.రాజేందర్‌రెడ్డి, మాజీ అడ్వొకేట్ జనరల్‌లు దేశాయి ప్రకాశ్‌రెడ్డి, బీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

జీఎస్టీ.. దేశ ఆర్థిక చరిత్రలో ఓ మలుపు: గవర్నర్

వస్తువులు, సేవల పన్ను (జీఎస్టీ) ప్రవేశపెట్టడం మన దేశ ఆర్థిక చరిత్రలో ఒక మలుపు అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అభిప్రాయపడ్డారు. శనివారం తాజ్ దక్కన్ హోటల్‌లో తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) ఆధ్వర్యంలో జీఎస్టీ రూపకల్పనలో కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థ పాత్రపై సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థ మధ్య సమన్వయం అవసరమన్నారు. ఒకే దేశం.. ఒకే పన్ను విధానానికి జీఎస్టీ దోహదం చేసిందన్నారు. సాహసోపేతమైన సంస్కరణల మాదిరిగానే జీఎస్టీని ప్రవేశపెట్టినప్పుడు అవాంతరాలు తప్పలేదని పేర్కొన్నారు. ఎక్కడైతే ప్రజలకు న్యాయం అందుతుందో.. అక్కడ ధర్మంతోపాటు రాజుకు బలమైన పునాది ఏర్పడుతుందని కౌటిల్యుడు చెప్పిన మాటలను ఉదహరించారు. పన్ను చెల్లింపుదారులందరూ ప్రభుత్వం అందిస్తున్న వన్ టైమ్ వడ్డీ మాఫీ పథకాన్ని ఈ నెల 31లోగా పన్ను చెల్లించి లబ్ధి పొందాలని రాష్ట్ర వాణిజ్య పన్నుల కమిషనర్ కె.హరిత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్వీ భట్టి మాట్లాడారు. ఎఫ్‌టీసీసీఐ జీఎస్టీ కమిటీ చైర్మన్ మొహమ్మద్ ఇర్షాద్ అహ్మద్, బాంబే హైకోర్టు సీనియర్ న్యాయవాదులు లక్ష్మీకుమారన్, శ్రీధరన్ తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' పోటీకి ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తేయాలి

- సీఎంకు తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: నియోజకవర్గాల పునర్విభజన ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని స్థానిక ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తేయాలని తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్.. సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తిచేసింది. గ్రామీణ ప్రజాస్వామ్యానికి పంచాయతీరాజ్ వ్యవస్థ పునాది అని, స్థానిక ప్రజలకు పాలనలో భాగస్వామ్యం కల్పించే ఈ వ్యవస్థలో ముగ్గురి కంటే ఎక్కువ మంది పిల్లలున్న తల్లిదండ్రులు పోటీచేయలేకపోతున్నారని చాంబర్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి తెలిపారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని వారు రాజకీయంగా వెనుకబడిపోతున్నారని ఒక ప్రకటనలో వెల్లడించారు. నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న భావన ప్రజల్లో ఏర్పడినందున, తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుత జనాభా పెంపుదలను ప్రోత్సహించే దశలో ఉన్నందున ఈ నిబంధనను ఎత్తేయాలని కోరారు.

చంద్రబాబుని మించిన అవకాశవాది పవన్: అంబటి



సాక్షి, అమరావతి: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ టీడీపీ అధినేత చంద్రబాబుని మించిన అవకాశవాది అని వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సూపర్ సిక్స్, 143 హామీల అమలుపై జయకేతనం సభలో పవన్ ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. మెడికల్ కాలేజీలు, పోర్టులను చంద్రబాబు ప్రైవేటుకు ధారాదత్తం చేస్తుంటే ఎందుకు నోరెత్తడంలేదని అన్నారు. అంబటి రాంబాబు శనివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. పైకి నిజాయితీపరుడినని చెప్పుకొనే పవన్‌కు జనసేన ఎమ్మెల్యేల దోపిడీ, అవినీతి, బెదిరింపులు కనిపించడం లేదని దుయ్యబట్టారు. పవన్‌కి ప్రియాతి ప్రియమైన మంత్రి నాదెండ్ల మనోహర్ రేషన్ దోపిడీకి అడ్డే ఉండటంలేదని అన్నారు. నాయకులు ప్రజల నుంచే పుట్టాలని, వారసత్వ రాజకీయాలేమిటంటూ మాటలు చెప్పే పవన్.. వచ్చిన ఒక్క ఎమ్మెల్సీ పదవినీ అన్న నాగబాబుకే ఇచ్చుకున్నాడన్నారు. ఎన్నికల్లో గెలిపించే బాధ్యత నీదేనంటూ సీటు త్యాగం చేసిన వర్మతో పనిచేయించుకుని, ఆయన వల్ల గెలిచామంటే నీ ఖర్మ అంటూ ఆయన్ని ఎగతాళి చేశారని అన్నారు. అక్కర గడుపుకొని మోసం చేయడంలో, అవకాశవాదంలో చంద్రబాబునే మించిపోయారని చెప్పారు. 40 ఏళ్ల టీడీపీ పడిపోతుంటే నిలబెట్టామని మాత్రం పవన్ నిజం చెప్పారని తెలిపారు. ఇదే విషయాన్ని తాము మొదట్నుంచి చెబుతూనే ఉన్నామని తెలిపారు. పవన్ ప్రజల కోసం పోరాడే వ్యక్తి కాదని, చంద్రబాబుకు ఊడిగం చేయడానికి, టీడీపీకి బి టీమ్‌గా జనసేనను స్థాపించారని చెప్పారు.

'రాయలసీమ'పై కేంద్రం కొరడా

▶ మొదటి పేజీ తరువాయి

సైట్‌ను తనిఖీ చేశాక ఈ ధ్రువీకరణ పత్రం జారీ చేయాలని కోరింది. డీపీఆర్ తయారీ ముసుగులో పర్యావరణానికి ఏదైనా హానీ చేసినట్టు తనిఖీల్లో గుర్తిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని చెప్పింది.

రాష్ట్ర ప్రభుత్వ విజయం: మంత్రి ఉత్తమ్

రాయలసీమ ఎత్తిపోతల పథకానికి కేంద్రం పర్యావరణ అనుమతులు నిరాకరించడం రాష్ట్ర ప్రభుత్వం సాధించిన విజయమేనని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. ప్రాజెక్టును అడ్డుకోవడానికి ఇప్పటికే ప్రభుత్వం కృష్ణా బోర్డు, ఎన్జీటీ, కృష్ణా ట్రిబ్యునల్–2, సుప్రీం కోర్టులను ఆశ్రయించిందన్నారు. ఈ ప్రాజెక్టును అడ్డుకోవాలని కోరుతూ తాను కేంద్ర జలశక్తి శాఖకు లేఖ రాయగా, శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా కేంద్ర పర్యావరణ శాఖ కార్యదర్శికి లేఖ రాశారన్నారు.

హాజరు నుంచి హోంవర్క్ దాకా..



▶ మొదటి పేజీ తరువాయి

హాలిడేస్ లిస్ట్ వంటివి సైతం యాప్ ద్వారానే అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిద్వారా తల్లిదండ్రులు తమ పిల్లల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. ప్రతి విద్యార్థికి సంబంధించి కనీస సామర్థ్యాలు సాధించే దిశగా విద్యార్థి సూచిక (స్టూడెంట్ ప్రొఫైల్) ఉంటుంది. సబ్జెక్టుల వారీగా వెనుకబడిన తీరు, పురోగతి సాధిస్తున్న అంశాలను ఇందులో పొందుపర్చనున్నారు.

పిల్లలు గైర్హాజరైతే వెంటనే మెసేజీ వస్తుంది



మా పిల్లలు ప్రభుత్వ స్కూల్‌లోనే చదువుతున్నారు. వాళ్లు స్కూల్‌కు వెళ్లకుంటే నా ఫోన్‌కు మెసేజీ వస్తుంది. ఇలా తల్లిదండ్రులకు విద్యార్థుల సమాచారం తెలపడం బాగుంది. టీచర్లు అసైన్‌మెంట్లను యాప్‌లో పెడుతుండటంతో.. పిల్లలు ఇంటికి వచ్చాక వారిని దగ్గరుండి చదివిస్తున్నాం. – ముక్కెర రమేశ్, విద్యార్థి తండ్రి

నల్లగొండకు నీళ్లు.. పాలమూరుకు కన్నీళ్లు

- ఏదుల ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపాలి
- పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ రాఘవాచారి



విలేకరులతో మాట్లాడుతున్న రాఘవాచారి

కల్వకుర్తి రూరల్: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించి దాదాపు 12 ఏళ్లు కావొస్తున్నా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు ఇంకా అన్యాయమే జరుగుతుందని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి అన్నారు. శనివారం కల్వకుర్తిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని ఏదుల నుంచి నల్లగొండకు నీటిని తరలించేందుకు ప్రభుత్వం రూ.1,800 కోట్లు కేటాయిస్తూ గత జనవరి 22న జీఓ నంబర్ 11ను విడుదల చేయడం బాధాకరమన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపడితే ఉమ్మడి పాలమూరు జిల్లాకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. గతంలో డిండి ప్రాజెక్టు ఎత్తు పెంచి నల్లగొండకు నీటిని తరలించే విషయంపై పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించడంతో పాటు నార్లాపూర్ నుంచి నల్లగొండకు నీటిని తరలించేందుకు చేసిన ప్రయత్నాన్ని అప్పటి అధికార పార్టీ బీఆర్‌ఎస్‌తో పాటు కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం, సీపీఐ, ప్రజాసంఘాలు వ్యతిరేకించడంతో ఆయా ప్రాజెక్టుల నిర్మాణాలను ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. ప్రస్తుతం నల్లగొండకు నీటిని తరలించేందుకు ప్రయత్నించడం పాలమూరు రైతుల పొలాలను బీడుగా మార్చడమేనని అన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంలో ఉమ్మడి జిల్లా రైతులు లక్ష ఎకరాల భూములను కోల్పోయినా ఫలితం దక్కలేదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 5 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరిగితే.. అన్ని పార్టీలు నల్లగొండ జిల్లాకు చెందిన వారికి నాలుగు స్థానాలు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. నీరు ఉంటే రాజకీయాలను శాసించగల శక్తి ఉంటుందన్నారు. ప్రభుత్వాలు భూములను త్యాగం చేసిన రైతులను విస్మరిస్తుండటంతో.. ప్రాజెక్టులకు భూములు ఇచ్చేందుకు నిరాకరిస్తూ ప్రభుత్వంపై తిరగబడుతున్నారని చెప్పారు. రాబోయే రోజుల్లో రైతులను చైతన్యం చేసి ఏదుల నుంచి నల్లగొండకు నీటి తరలింపును అడ్డుకుందామని పిలుపునిచ్చారు. ఇప్పటికే ఏదుల ప్రాజెక్టు నిర్మాణాన్ని నిలిపివేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు జిల్లాలోని ఎమ్మెల్యేలకు బహిరంగ లేఖ రాశామని తెలిపారు.

⇨ మండలంలోని ముకురాలలో ఆత్మహత్య చేసుకున్న చంద్రశేఖర్ రెడ్డి కుటుంబాన్ని ఆయన పరామర్శించి.. ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకునే ప్రయత్నం చేసినట్లు రాఘవాచారి చెప్పారు. ప్రభుత్వం స్పందించి ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకోవడంతో పాటు రాబోయే రోజుల్లో ఎవరూ ఆత్మహత్య చేసుకోకుండా చూడాలని కోరారు. సమావేశంలో అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ వెంకట్ గౌడ్, సభ్యులు శ్రీను, సదానందం గౌడ్, మేకల రాజేందర్ పాల్గొన్నారు.

అఘోరిని అడ్డుకున్న పోలీసులు

- భైరాపురం స్టేజీ వద్దనే నిలిపివేత
- వెనక్కి వెళ్లాలని నచ్చజెప్పిన పోలీసులు
- ససేమీరా అంటూ అక్కడే ఉన్న అఘోరి
- వాహనంతో సహా టోయింగ్‌తో తరలింపు



అఘోరి వాహనాన్ని నిలిపివేసిన పోలీసులు

అలంపూర్: అలంపూర్‌కు వెళ్లకుండా మహిళా అఘోరిని పోలీసులు అడ్డుకున్నారు. శాంతిభద్రతల్లో భాగంగా నాగసాధువు అఘోరిని పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి టోయింగ్ వాహనం ద్వారా హైదరాబాద్‌కు తరలించారు. నాగసాధువు మహిళా అఘోరి ఇటీవలే అలంపూర్‌లోని దర్గాపై సంచలన వ్యాఖ్యలు చేశారు. అందులో భాగంగా మహిళా అఘోరి శనివారం అలంపూర్‌కు వచ్చారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఉదయం నుంచే పోలీసులు అలంపూర్ చౌరస్తా, డి.బూడిదపాడు, భైరాపురం స్టేజీ వద్ద పహరా కాశారు. డీఎస్పీ మొగులయ్య, అలంపూర్ సీఐ రవిబాబు, శాంతినగర్ సీఐ టాటబాబుతో పాటు ఎస్‌ఐలు, పోలీసులు భైరాపురం స్టేజీ వద్ద పహరా ఏర్పాటు చేశారు. మహిళా అఘోరి వాహనం భైరాపురం స్టేజీకి చేరుకున్న సమయంలో పోలీసులు అక్కడే నిలిపివేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో అలంపూర్‌కు వెళ్లడానికి అనుమతి లేదని, వెనక్కి వెళ్లాలని సూచించారు. ఈక్రమంలో పోలీసులు వాహనాన్ని తనిఖీ చేశారు. అఘోరి దేవతా విగ్రహాలను బయటికి తీసి చూపించారు. వాటిని పరిశీలించడానికి వెళ్తున్న పోలీసులపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు సైతం అదేస్థాయిలో స్పందించారు. డీఎస్పీ మొగులయ్య, సీఐ రవిబాబు మరోసారి అఘోరికి నచ్చజెప్పడానికి ప్రయత్నించారు. కానీ అఘోరి కారులో కూర్చోని బయటికి రాలేదు. దీంతో మహిళా ఎస్‌ఐలు, పోలీసులు సైతం నచ్చజెప్పడానికి ప్రయత్నించారు. దాదాపు గంటకు



అఘోరితో మాట్లాడుతున్న డీఎస్పీ మొగులయ్య

పైగా నిరీక్షించిన పోలీసులు చివరకు అఘోరి కూర్చున్న కారును జేసీబీ సాయంతో అక్కడి నుంచి తొలగించడానికి ప్రయత్నించారు. కానీ అది సాధ్యపడకపోవడంతో ప్రైవేటు టోయింగ్ వాహనాన్ని పిలిపించారు. టోయింగ్ వాహన సాయంతో మహిళా అఘోరి కారును తరలించారు. టోయింగ్ వాహనంతో తరలించే క్రమంలో కారులోనే ఉన్న అఘోరి కిందకు దిగడానికి ప్రయత్నించారు. దీంతో పోలీసులు అదుపులోకి తీసుకోవడానికి వెళ్లడంతో తిరిగి కారులోనే కూర్చున్నారు. దీంతో ఉండవెల్లి మీదుగా జాతీయరహదారి ఎక్కి హైదరాబాద్ వైపు తీసుకెళ్లారు. టోయింగ్ వాహనంతో తీసుకెళ్తున్న క్రమంలో తన కారులోనే కూర్చున్న అఘోరిని గాలి కోసం అద్దం కిందికి దించుకోవాలని సూచించగా అసహనంతో అద్దం పగలగొట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈవిషయమై సీఐ రవిబాబు మాట్లాడుతూ ఇటీవలే చేసిన వ్యాఖ్యల కారణంగా అఘోరిని అడ్డుకున్నట్లు తెలిపారు. ముందస్తు అరెస్టు చేసి తరలించినట్లు వెల్లడించారు.

మహిళా కూలీలే లక్ష్యం



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ డి.జానకి, చిత్రంలో ఏఎస్పీ రాములు

- దోపిడీలకు పాల్పడుతున్న ముఠాను అరెస్టు చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్ క్రైం: ముగ్గురు వ్యక్తులు కలిసి ఓ ముఠాగా ఏర్పడి.. అడ్డా మీద ఉండే మహిళా కూలీలను లక్ష్యంగా చేసుకుని దోపిడీలకు పాల్పడుతున్నారు. పూర్తిగా జల్సాలకు, అసాంఘిక కార్యక్రమాలకు అలవాటు పడి మహిళా కూలీలను తీసుకెళ్లి వారిపై ఉన్న బంగారం, వెండి ఆభరణాలు దోచుకుంటున్న ముఠాను వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ డి.జానకి వెల్లడించారు. మహ్మదాబాద్ మండలం చౌడాపూర్ తండాకు చెందిన కట్రావత్ భరత్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతను కోస్గి మండలం మల్లారెడ్డిపల్లికి చెందిన కామారం నరేష్, టంకరకు చెందిన సామే శోభతో కలిసి ఓ ముఠాగా ఏర్పడి మద్యం తాగుతూ జల్సాలు చేయడం, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతుంటారు. ఈ క్రమంలో ఈనెల 12న ఉదయం 10 గంటల సమయంలో జిల్లాకేంద్రంలోని టీడీగుట్ట అడ్డా మీదకు కూలీ పని కోసం వచ్చిన వెంకటాపూర్ గ్రామానికి చెందిన అంజమ్మతో పాటు మరో మహిళను పని ఇప్పిస్తామని అని చెప్పి ఆటోలో ఎక్కించుకున్నారు. మొదట దొడ్డలోనిపల్లికి వెళ్లి అక్కడి నుంచి మయూరి పార్క్ సమీపంలో అడవిలోకి ఇద్దరూ మహిళలను తీసుకువెళ్లి వారిపై దాడి చేసి ఒంటిపై ఉన్న బంగారం, వెండి ఆభరణాలు తీసుకున్నారు. అదేవిధంగా మరో కేసులో కామారం నరేష్ ఈ నెల 13న టీడీగుట్ట దగ్గర కూలీ పని కోసం ఎదురుచూస్తున్న మరో మహిళను ఆటోలో కొత్త కలెక్టరేట్‌కు ఎదురుగా ఉన్న అడవిలోకి తీసుకువెళ్లి మెడలో ఉన్న పుస్తెలతాడు, కాళ్ల కడియాలు అపహరించాడు. ఈ రెండు కేసుల్లో ఏ1 కట్రావత్ భరత్, ఏ2 కామారం నరేష్, ఏ3 సామే శోభలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్పీ వెల్లడించారు. ఈ కేసు చేధించిన పోలీస్ అధికారులను ఎస్పీ అభినందించారు. సమావేశంలో అదనపు ఎస్పీ రాములు, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ అప్పయ్య, ఎస్‌ఐ శీనయ్య పాల్గొన్నారు.

సిగ్నల్‌గడ్డపై ట్రాఫిక్ జాం (ఇన్‌సెట్‌లో..) రోడ్డుపై నిలిపి ఉంచిన వాహనాలతో నిలిచిన వాహనాలు





ఎన్నాళ్లీ అవస్థలు..

జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని సిగ్నల్‌గడ్డపై శనివారం భారీగా ట్రాఫిక్ స్తంభించింది. రోడ్డు విస్తరణ పనులు నెమ్మదిగా నడుస్తుండడంతో పాటు రెండు రోజులుగా ఒకే రోడ్డుపై రాకపోకలు సాగుతున్నాయి. శనివారం నుంచి పాఠశాలలకు ఒంటిపూట ప్రారంభమయ్యాయి. రోజువారీ ట్రాఫిక్‌తో పాటు మధ్యాహ్నం స్కూల్ బస్సులు, పాఠశాలల నుంచి బయటకు వచ్చే విద్యార్థులు ఒకేసారి రోడ్డుపైకి రావడంతో సిగ్నల్‌గడ్డపై ఒక్కసారిగా ట్రాఫిక్ స్తంభించింది. మరోవైపు ఎండలు పెరగటంతో రోడ్డుపై వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ట్రాఫిక్ సమస్య ఏర్పడుతున్నా మున్సిపల్ అధికారులు, పోలీసులు చోద్యం చూస్తున్నారని పలువురు వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

– జడ్చర్ల టౌన్

మూడు ఉద్యోగాలు సాధించిన యువతి



తెలకపల్లి: మండలంలోని గడ్డంపల్లి గ్రామానికి చెందిన మద్దెల పుల్లయ్య–బాలమ్మ దంపతుల కూతురు మద్దెల అరుణ మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. కుటుంబం, పిల్లలు ఉన్నా పట్టుదలతో చదివి ఉద్యోగాలు సాధించింది. 2018లో బీసీ పీజీటీ ఫిజిక్స్‌లో చేరి ఉద్యోగం సాధించింది. 2019లో గురుకుల డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా (డీఎల్) సూర్యాపేటలో విధులు నిర్వహించింది. 2025లో ఇటీవల జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో నాగర్‌కర్నూల్ ప్రభుత్వ బాలికల కళాశాలలో జూనియర్ లెక్చరర్ ఉద్యోగం సాధించింది. ఉద్యోగాలు సాధించడంలో కుటుంబ సభ్యుల కృషి ప్రోత్సాహం ఎంతో ఉందని మద్దెల అరుణ తెలిపారు.

పరిహారమిచ్చాకే పనులు చేపట్టాలి



రిలే నిరాహార దీక్షలు చేస్తున్న నిర్వాసితులు

జడ్చర్ల: ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనులకు సంబంధించి తమకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, తదితర పరిహారమిచ్చాకే పనులు చేపట్టాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. శనివారం ఉదండాపూర్ రిజర్వాయర్ కట్టపై కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల్లో నిర్వాసితులు పాల్గొన్నారు. ఇటీవల ఉదండాపూర్‌లో రీసర్వేకు సంపూర్ణంగా సహకరించామని, తమకు పూర్తి స్థాయిలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పెంచి తమకు అందజేసిన తరువాతనే పనులు మొదలు పెట్టాలని కోరారు. తాజాగా 18 సంవత్సరాల వయస్సు నిండిన వారికి ప్యాకేజీ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పనులను అడ్డుకున్నారన్న కారణాలు చూపుతు తమపై పోలీసులు కేసులు నమోదు చేశారని, ఆయా కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. న్యాయపరమైన తమ డిమాండ్లను పరిష్కరించి న్యాయం చేయాలన్నారు. శ్రీను, వెంకటయ్య, రాములు, ఆంజనేయులు పాల్గొన్నారు.